జగన్‌రెడ్డి పాలనలో తిరుపతి జిల్లాలో భూందాం వ్యవహారాలు జోరుగానే సాగినట్లు ప్రభుత్వం మారాక వెలుగులోకి వస్తున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. పేదలకు, ఇతర కొన్ని వర్గాలకూ ప్రభుత్వం ఇచ్చిన భూములను అధికారం చేతిలో ఉండడంతో పెద్దఎత్తునే కొల్లగొట్టినట్లు చెబుతున్నారు. అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్‌గా మార్చిన తీరు అనేక అనుమానాలకు దారితీస్తోంది.జిల్లాలో శ్రీకాళహస్తి ప్రాంతం ఈ ఫ్రీహోల్డ్ వ్యవహారాల్లో అగ్రస్థానంలో ఉంది. అప్పటి ప్రధాన నాయకుడు, అధికారులు కలిసి భారీగానే వ్యవహారాలు నడిపినట్లు ప్రచారం అవుతోంది. ఫ్రీహోల్డ్ భూములపై రాష్ట్రవ్యాప్తంగా విచారణ జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో జరిగిన భాగోతాలూ వెలుగు చూస్తున్నాయి. - తిరుపతి, ఆంధ్రజ్యోతి



ఫ్రీహోల్డ్ పేరుతో భారీగా భూం చేశారు!

- పేదల నోరుకొట్టి.. భూములు కొల్లగొట్టి..
- వెలుగులోకి వస్తున్న జగన్‌రెడ్డి పాలనలోని బాగోతాలు
- శ్రీకాళహస్తి ప్రాంతంలోనే అక్రమాలు అధికం

జిల్లాలో 44,526 ఎకరాలు ఫ్రీహోల్డ్

గత ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా 44,526 ఎకరాల అసైన్డ్ భూములను ఫ్రీహోల్డ్ చేశారు. అంటే పేదలకూ, ఇతర వర్గాలకూ ప్రభుత్వం ఇచ్చిన భూములపై సంపూర్ణ యాజమాన్య హక్కులు కల్పించడం అన్నమాట. ఎటువంటి ఆటంకమూ లేకుండా ఈ భూములను అమ్ముకోవచ్చు, కొనవచ్చు. ఆ మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఇలా ఫ్రీహోల్డ్ అయిన భూముల ధరలు అమాంతం పెరిగిపోతాయి. ఇది అప్పటి నాయకులకూ, అధికారులకూ కోట్లు పోగేసిందని అంటున్నారు. రెవిన్యూ డివిజన్ల వారీగా చూస్తే శ్రీకాళహస్తి, గూడూరు డివిజన్లలో అత్యధికంగా అసైన్డ్ భూములు ఫ్రీ హోల్డ్ అయ్యాయి. శ్రీకాళహస్తి డివిజన్‌లో 15,647 ఎకరాలు ఫ్రీ హోల్డ్ కాగా గూడూరు డివిజన్‌లో 15,198 ఎకరాలు, తిరుపతి డివిజన్‌లో 7,611 ఎకరాలు, సూళ్ళూరుపేట డివిజన్‌లో 6069 ఎకరాలు వంతున అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేశారు. మండలాల వారీగా చూస్తే బాలాయపల్లిలో అత్యధికంగా 7548 ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేయగా, శ్రీకాళహస్తి మండలంలో 7,402ఎకరాలు ఫ్రీ హోల్డ్ చేయడం గమనార్హం.

మండలాలవారీగా ఫ్రీహోల్డ్ అయిన తీరు

మండలం	ఎకరాలు
బాలాయపల్లి	7548
శ్రీకాళహస్తి	7402
కేవీబీపురం	3512
ఎర్రావారిపాలెం	3121
డక్కిలి	2313
గూడూరు	1873
తొట్టంబేడు	1873
ఏర్పేడు	1725
కోట	1608
తడ	1363
పెళ్ళకూరు	1139
నాయుడుపేట	1078
చంద్రగిరి	1021
ఆర్సీపురం	986
చిల్లకూరు	942
డీవీ సత్రం	834
ఓజిలి	760
పుత్తూరు	727
చిట్టమూరు	677
వడమాలపేట	648
పాకాల	616
సూళ్ళూరుపేట	540
చిన్నగొట్టిగల్లు	460
నారాయణవనం	424
పిచ్చాటూరు	387
రేణిగుంట	310
వరదయ్యపాలెం	155
వెంకటగిరి	118
వాకాడు	116
బీఎన్ కండ్రిగ	102
సత్యవేడు	95
తిరుపతి రూరల్	28
నాగలాపురం	11
మొత్తం	44526

1105 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు

జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు ఆగమేఘాల మీద జరిగిపోవడం మొదలైంది. ఇప్పటికే 1105 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికార యంత్రాంగం గుర్తించింది. వీటిల్లోనూ అత్యధికంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు వెల్లడైంది. శ్రీకాళహస్తి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో 453 ఎకరాలకు, తొట్టంబేడు కార్యాలయంలో 209 ఎకరాలకు, రేణిగుంట కార్యాలయంలో 17 ఎకరాలకు చొప్పున ఈ నియోజకవర్గంలో మొత్తం 679 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. తర్వాతి స్థానంలో చంద్రగిరి నియోజకవర్గం నిలిచింది. పాకాల కార్యాలయంలో 159 ఎకరాలు, చిన్నగొట్టిగల్లు కార్యాలయంలో 79 ఎకరాలు, చంద్రగిరి కార్యాలయంలో 72 ఎకరాలు, తిరుపతి రూరల్ కార్యాలయంలో 5 ఎకరాల చొప్పున ఈ నియోజకవర్గంలో మొత్తం 316 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు చేశారు. పుత్తూరు కార్యాలయంలో 92 ఎకరాలకు, పిచ్చాటూరు కార్యాలయంలో 9 ఎకరాలకు, సత్యవేడు కార్యాలయంలో 5 ఎకరాలకు చొప్పున రిజిస్ట్రేషన్లు జరిగాయి.

శ్రీకాళహస్తిపై ప్రత్యేక దృష్టి

జిల్లా మొత్తంలో అసైన్డ్ భూములను ఫ్రీ హోల్డ్ చేయడం, వాటిని రిజిస్టర్ చేయడం రెండూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోనే ఎక్కువగా జరిగాయి. 7400 ఎకరాలకు పైగా అసైన్ చేసిన భూములను ఇక్కడి అధికారులు ఫ్రీ హోల్డ్ చేయగా అందులో 679 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. ఈ స్థాయిలో సంబంధిత ప్రక్రియ మరే మండలంలోనూ జరగలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇక్కడి ముఖ్యనేత ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు పెద్దఎత్తున ఆక్రమించారని, ఇతరులకు విక్రయించి భారీగా సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో రేణిగుంట, ఏర్పేడు తదితర మండలాల్లో పనిచేసిన రెవిన్యూ అధికారులు ముఖ్యనేతకు సహకరించి ఆ నేతతో సమానంగా రూ. కోట్లు పోగేసుకున్నారని తీవ్ర స్థాయి ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. ఇద్దరు అధికారులపై బదిలీ వేటు పడడంతో పాటు ఓ అధికారిపై ఏసీబీ కేసు సైతం నమోదైంది. ఈ కారణంగా ప్రస్తుత ప్రభుత్వం ఈ నియోజకవర్గంపై ప్రధానంగా దృష్టి సారించింది. ప్రయోగాత్మకంగా శ్రీకాళహస్తి మండలంలో ఫ్రీ హోల్డ్ భూములపై క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరపాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. అక్కడ అక్రమాలు జరిగినట్టు తేలితే జిల్లా అంతటా పరిశీలించాలని నిర్ణయించింది. అందులో భాగంగా శ్రీకాళహస్తి మండలంలో జరుగుతున్న పరిశీలన మరో రెండు రోజుల్లో ముగియనున్నట్టు తెలిసింది. శ్రీకాళహస్తి మండలంలో పశువుల మేత బీడుగా రెవిన్యూ రికార్డుల్లో నమోదైవున్న భూములను కూడా ఫ్రీ హోల్డ్ చేసినట్టు తెలిసింది. అలాగే ప్రభుత్వం నుంచి భూములు పొందినవారి చేతుల్లో ఉంటేనే ఫ్రీహోల్డ్ చేయాల్సి ఉన్నా, ఇతరుల చేతుల్లో ఉన్న భూములనూ ఫ్రీహోల్డ్ చేసేసినట్టు గుర్తించారు.అప్పటి అధికారులు అన్ని స్థాయుల్లోనూ నేతకు సహకరించారని అంటున్నారు. సమగ్ర నివేదిక వస్తే పూర్తి స్థాయిలో అక్రమాలు వెల్లడి కానున్నాయి.

ఆంధ్రజ్యోతి- తిరుపతి

బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) సరైన పర్యవేక్షణ లేక పాలన గతి తప్పుతోంది. వివాదాల సుడిలో చిక్కుకున్న బర్డ్ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఒకరిద్దరు చేసిన తప్పులకు వైద్యులు, కిందిస్థాయి సిబ్బంది విజిలెన్స్ విచారణ ఎదుర్కోవాల్సి రావడంతో విధుల్లోకి వచ్చేందుకు భయపడుతున్నారు. సెలవుపెట్టి వెళ్లిపోతుండడంతో ఓపీలు తగ్గిపోతున్నాయి. ఆపరేషన్లు వాయిదా పడుతున్నాయి.

గతి తప్పిన 'బర్డ్'

- వైద్యులు లేక పడిపోయిన ఓపీలు
- గత అక్రమాలపై కొనసాగుతున్న విచారణ


ఆరోగ్యమిత్ర డెస్క్ ముందు వేచివున్న వృద్ధ జంట

ఒకప్పటి బర్డ్‌లా లేదు

350 పడకల సామర్థ్యం కలిగిన బర్డ్‌కు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రోజూ సుమారు 700మందికి పైగా అవుట్ పేషెంట్లు వైద్య సేవల కోసం వస్తుంటారు. రోగులకు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు ఆధునిక వసతులున్నాయి. ఆరు అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లలో రోజుకు 25 వరకు శస్త్ర చికిత్సలు జరిగేవి. ప్రస్తుతం ఆపరేషన్ల సంఖ్య పదికిలోపే పడిపోయింది. ఒకప్పుడు బర్డ్‌లో ఓపీ తీసుకోవాలంటే ఉదయం ఐదు గంటలకే చేరుకోవాలి. వారంతో పనిలేకుండా ఆ స్థాయిలో రద్దీ ఉండేది. మధ్యలో ఏదైనా సెలవు వస్తే తర్వాత రోజు రెట్టింపు రోగులు వచ్చేవారు. గడిచిన ఐదేళ్లుగా పరిస్థితి మారిపోయింది. టీటీడీ నిధులతో నిర్వహించే ఆస్పత్రిని కమర్షియల్‌గా మార్చడంతో సహజంగా పేదరోగుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఆగస్టు 15నుంచి వరుసగా నాలుగు రోజులపాటు బర్డ్‌లో ఓపీలు చూడలేదని తెలిసింది. స్వాతంత్ర్య దినోత్సవంతోపాటు ఒక రోజు ఆదివారం రావడం, మధ్యలో శ్రావణశుక్రవారం, మెడికో మృతికి నిరసనగా వైద్యం బంద్ చేసి మొత్తం నాలుగు రోజులు ఓపీలు లేకుండా చేశారు. టీటీడీ సంస్థల్లో బంద్ నిర్వహించకూడదన్న నిబంధన ఉన్నప్పటికీ సరైన పర్యవేక్షణ లేకపోవడంతో నిరసన పేరుతో ఓపీకి సెలవు ప్రకటించేశారు. దీనిపై టీటీడీ విజిలెన్స్ విచారణ కూడా చేసినట్టు తెలిసింది. ఇక అసలు విషయానికి వస్తే నాలుగు రోజుల సెలవుల తర్వాత వచ్చిన సోమవారం ఓపీ హాలు కిక్కిరిసిపోవాలి. కానీ ఆ రోజు కూడా ఓపీ హాలు ఖాళీగా కనిపించింది. ఇద్దరు ముగ్గురు వైద్యులు మాత్రమే వారి చాంబర్‌లో ఉంటే వందలోపు మాత్రమే రోగులు కనిపించారు. వారు కూడా రోజుకు 20 మందికిపైగా ఓపీ చూడలేమని తేల్చి చెప్పేసినట్టు తెలిసింది. ఇక ఆరోగ్యమిత్ర డెస్క్ వద్ద గంటపాటు ఎవరూ కనిపించలేదు. ఎన్టీఆర్ వైద్యసేవ కోసం వచ్చిన ఓ వృద్ధ జంట డెస్క్ ముందు నిల్చొని విసిగిపోయి పక్కకు వెళ్లిపోవడం కనిపించింది. సెక్యూరిటీ సిబ్బంది స్మార్ట్ ఫోన్‌లో రీల్స్ చూసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. నాలుగైదు బెడ్లు కలిగిన ప్లాస్టర్ గదిలో ఇద్దరు సిబ్బంది పనిలేక పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.ఎవరెవరు వస్తున్నారో? ఎప్పుడొస్తున్నారో? పట్టించుకునే పరిస్థితి కనిపించలేదు.పూర్తిస్థాయి డైరెక్టర్ బర్డ్‌లో అందుబాటులో ఉంటే సిబ్బందికి కూడా జవాబుదారీతనం ఉంటుంది. పాలనాపరమైన వ్యవహారాలతోపాటు రోగులకు మెరుగైన వైద్యం అందించే అవకాశం ఉంటుంది. ఆ దిశగా టీటీడీ ఉన్నతాధికారులు దృష్టిపెట్టాల్సి ఉంది.

పర్చేజ్ కమిటీ సభ్యులకు మెమోలు

బర్డ్‌లో విజిలెన్స్ విచారణ కూడా కొనసాగింది. మాజీ ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి బాగోతాలను ఒక్కొక్కటిగా బయటకు లాగుతున్నారు. అదేవిధంగా ఆయన నేతృత్వంలో ఏర్పాటైన పర్చేజ్ కమిటీ సభ్యులు డాక్టర్ దీపక్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ రామ్మూర్తిలతో పాటు ఆఫీస్ సూపరింటెండెంట్ మల్లీశ్వరికి విజిలెన్స్ అధికారులు మెమోలు ఇచ్చినట్టు తెలిసింది. సీటీ స్కాన్ కొనుగోలుకు టెండర్లు ఎలా పిలిచారు? ఇంప్లాంట్లు సరఫరా చేసే కంపెనీలను ఏ ప్రాతిపదికన తీసుకున్నారు? ఆపరేషన్ చేసే వైద్యుల ఇష్టానుసారం పలానా కంపెనీ ఇంప్లాంట్ రోగికి అమర్చారా? లేదా రెడ్డెప్పరెడ్డి సూచించినవే వినియోగించారా? వంటి అంశాలపై ఆరా తీస్తున్నట్టు తెలిసింది. అది కూడా విజిలెన్స్ అధికారులు రూపొందించిన ప్రశ్నల ఫార్మాట్‌ను మెమోలతోపాటు ఇచ్చి వాటిని పూరించాలని చెప్పినట్టు సమాచారం. అయితే కొన్ని మెడికల్ సాంకేతిక అంశాలపై లోతుగా విచారణ చేసేందుకు విజిలెన్స్ సిబ్బంది తటపటాయిస్తున్నట్టుగా తెలుస్తోంది. భవిష్యత్తులో ఇలాంటి విచారణ ఏదైనా వస్తే పూర్తిస్థాయి అవగాహన ఉన్న సీనియర్ వైద్యులను ముందుగానే టీటీడీ అనుబంధ ఆస్పత్రులకు రెడ్డెప్పరెడ్డి బదిలీ చేయించినట్టుగా చెబుతున్నారు. అలాంటి వాళ్లగురించి తెలుసుకుని విచారిస్తే విజిలెన్స్ అధికారులకు మరింత సమాచారం దొరికే అవకాశం ఉంటుంది.

మెడికల్ షాపు కూడా మూతే

బర్డ్‌లో జనరిక్ బ్రాండెడ్ ఫార్మసీని ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వంలో టీటీడీ నిర్ణయం తీసుకుంది. బర్డ్‌కు అనుబంధంగా ఉన్న మెడికల్ షాపుతోనే జనరిక్ మెడికల్ షాపు నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. 20 శాతం ఆదాయంతో రోగులకు మందులను సరఫరా చేస్తారు. ఇందులో వచ్చిన ఆదాయంలో చెరిసగం పంచుకునేలా ఒకే బ్రాండెడ్ మందులు జన ఔషధి మెడికల్ షాపులో అందుబాటులో ఉంటాయి. దీనికి సంబంధించిన పూర్తి సాఫ్ట్‌వేర్‌ను కూడా బర్డ్ తీసుకొచ్చింది. బర్డ్ కొత్త భవనం కిందనే జనరిక్ మెడికల్ షాపును పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేశారు. అయితే అది మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలింది. ఆ తర్వాత ఓపెన్ టెండర్ ద్వారా మెడికల్ షాపు కేటాయించినప్పటికీ బర్డ్ ఉన్నతాధికారికి, నిర్వాహకులకు లావాదేవీల్లో తేడా రావడంతో ప్రస్తుతం ఆ షాపు కూడా మూసివేశారు. ఇప్పుడు బర్డ్‌లో ఎలాంటి మెడికల్ షాపు లేకపోవడంతో రోగులు మందుల కోసం చీటీలు పట్టుకుని తిరుగుతున్నారు.

పట్టించుకోండి సారూ

టీటీడీ నిర్వహణలో ఉన్న బర్డ్ ఆస్పత్రి పాలనను పట్టించుకోకుండా అధికార యంత్రాంగం గాలికొదిలేసిందన్న విమర్శలు వస్తున్నాయి. ఉన్న ఒక్క ఆర్ఎంవో కూడా దీర్ఘకాలిక సెలవుపెట్టి వెళ్లిపోతున్నారు. అరకొర సీనియర్ వైద్యులకు కూడా అక్కడ విలువలేదని తెలుస్తోంది. దీంతో వారు కూడా అసంతృప్తితో విధులు నిర్వహించే పరిస్థితి. విద్య, వైద్యానికి మాత్రమే ఉండే టీటీడీ జేఈవో గౌతమి బర్డ్‌వైపు వెళ్లడంలేదన్న విమర్శలున్నాయి. ఇక ఇంచార్జి డైరెక్టర్‌గా ఉన్న మరో జేఈవో వీరబ్రహ్మం పరిస్థితి అలాగే తయారైంది.ఈవో ప్రత్యేక దృష్టి పెడితే తప్ప తలా, తోక లేని పక్షిగా మారిన బర్డ్ ఆస్పత్రి పూర్వ వైభవం సంతరించుకోదు.



డైరెక్టర్ గదికి తాళం - ఖాళీగా దర్శనమిస్తున్న ఓపీ హాలు

ఎస్బీఐ ఏటీఎం దొంగల అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 3: ఎస్బీఐ ఏటీఎంల నుంచి రూ. 39.53 లక్షలు కాజేసిన ఘటనలో కస్టోడియన్ కొంగర్ల సురేష్ బాబుతోపాటు నెల్లూరు జిల్లా బుజబుజ నెల్లూరుకు చెందిన క్యాష్ వ్యాన్ డ్రైవర్ మనోజ్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు కథనం మేరకు... తిరుపతిలోని కట్టకింద కొత్తపల్లికి చెందిన సురేష్ బాబు సెక్యూర్ వ్యాల్యూ ఇండియా లిమిటెడ్ సంస్థ ద్వారా ఎస్బీఐ పరిధిలోని 22 ఏటీఎంలకు కస్టోడియన్‌గా పనిచేస్తున్నాడు.ఇటీవల బెట్టింగ్‌లకు అలవాటు పడి భారీస్థాయిలో నష్టపోయాడు. దీంతో ఏటీఎంల నుంచి డబ్బులు కాజేయడానికి పథకం పన్నాడు.తిరుపతిలోని గిరిపురం, ఎల్.ఎస్.నగర్, కె.టి. రోడ్డులో ఉన్న మాన్యువల్ ఏటీఎంల నుంచి దశలవారీగా రూ.40 లక్షలనగదు కాజేశాడు.ఇంతలో ఎస్బీఐ ఏటీఎంలకు ఆడిట్ జరగబోతుందని తెలుసుకున్న సురేష్ బాబు మెల్లగా ఆ మూడు ఏటీఎంలలో అపహరించిన డబ్బును సరిచేసుకోవడం కోసం చంద్రగిరి ఏటీఎంలో వుంచడానికి ఇచ్చిన డబ్బును కాజేసి ఆ మూడు ఏటీఎంలలో సర్దాలనుకున్నాడు.ఈ నేపథ్యంలో ముత్తూట్ ఫైనాన్స్‌లో పరిచయమైన మనోజ్‌కు గతనెల 30వ తేది రాత్రి సెక్యూరిటీ గార్డు వేషం వెయించి, చేతికి గ్లౌజులు, ముకానికి మాస్క్ వేసి చంద్రగిరి ఏటీఎంలో దొంగతనం చేయించాడు.ఈ విషయం తెలుసుకున్న సెక్యూర్ వ్యాల్యూ ఇండియా లిమిటెడ్ సంస్థ ప్రతినిధి ఎస్బీఐ చీఫ్ మేనేజర్‌కు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు మేరకు చంద్రగిరి సీఐ రామయ్య కేసు నమోదుచేశారు. చంద్రగిరి ఎస్బీఐ ఏటీఎంలో నగదు అపహరణ కేసుకు సంబంధించి సమీపంలో ఉన్న పవిత్ర క్యాంటీన్ సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించారు.అక్కడ కన్పించిన మారుతి కారు నెంబరు ఆధారంగా ముందుకెళ్లారు.ఏఎస్పీలు రవి మనోహరాచారి, వెంకట్రావు, నాగభూషణరావు, డీఎస్పీలు రమణకుమార్, నరసింగప్ప, చంద్రగిరి ఎస్ఐ రామయ్య నాలుగు రోజులుగా వివిధ ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు.చంద్రగిరి మండలం గాదంకి టోల్‌గేట్ సమీపంలోని రాధే హోటల్ వద్ద సురేష్‌బాబును, మనోజ్‌ను అరెస్టు చేశారు. వారి వద్దనుంచి ఓ మారుతి కారుతోపాటు రిఫ్రిజిరేటర్, 2 సెల్ ఫోన్లు, 4 ఎస్బీఐ ఏటీఎం క్యాసెట్లు, యమహా స్కూటీ, రూ. 8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదును పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు తదితరులు

ఎస్ఐ రవిబాబు సస్పెన్షన్



తడ, సెప్టెంబరు 3: సూళ్లూరుపేటలో గత ఏడాది అక్టోబరు వరకు ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న రవిబాబుపై సస్పెన్షన్ వేటు పడింది.సూళ్లూరుపేట నుంచి రవిబాబు ఓజిలికి బదిలీ అయ్యాక వీఆర్‌కు పంపారు. అయితే సూళ్లూరుపేట ఎస్ఐగా ఉన్నప్పుడు జరిగిన అవకతవకలపై ఇప్పుడు చర్యలు తీసుకున్నారు. గత ఏడాది ఏప్రిల్‌లో టీడీపీ కార్యకర్తలపై వైసీపీ కార్యకర్తలు మారణాయుధాలతో దాడి చేశారు. టీడీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలవడంతో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఆ తరువాత వైసీపీ నాయకులు కల్పించుకోవడంతో కేసు నీరుగారిపోయింది.చివరకు ప్రత్యక్ష సాక్షులను సైతం తారుమారు చేసి కేసును తప్పుదోవ పట్టించారు. ఘటన జరిగిన ప్రదేశంలో దాడికి ఉపయోగించిన వస్తువులను సైతం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపకుండా దర్యాప్తును నిర్లక్ష్యం చేశారు.దీనిపై అప్పట్లో పోలీసులపై ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా ఈ కేసుకు సంబంధించిన ఆరోపణలపై ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేకంగా దృష్టి సారించి అంతర్గత విచారణ జరిపారు. ఇందులో అప్పట్లో ఎస్ఐగా పనిచేసిన పి.రవిబాబు నిర్లక్ష్యం బయటపడడంతో పాటు నిందితుల పేర్లను అనధికారికంగా తొలగించారని విచారణలో నిర్ధారణ కావడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలు జారీ చేశారు.

కానిస్టేబుల్, ఇద్దరు హోంగార్డుల సస్పెన్షన్

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 3 : గాజుల మండ్యం స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె. బాలాజీతో పాటు ఇద్దరు హోంగార్డులపై సస్పెన్షన్ వేటు పడింది.చైనా దేశీయుడికి వీసా గడువు పూర్తయినా ఇక్కడే నివాసముండడంపై 2021లో రేణిగుంట అర్బన్ పోలీసులు కేసు నమోదుచేశారు.అయితే చైనీయుడికి సహాయం చేస్తానంటూ బాలాజీ అతడి వద్ద నుంచి రూ. 2లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో తేలింది. దీంతో అతడిని సస్పెండ్ చేస్తూ ఎస్పీ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. తిరుపతి రూరల్ పోలీస్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు గిరి ఇసుక, కంకర రవాణా చేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ల నుంచి అక్రమ వసూళ్ళకు పాల్పడుతున్నాడని విచారణలో నిరూపణ కావడంతో అతడిని సస్పెండ్ చేశారు.అలిపిరి స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు రాజ్‌కుమార్ ఇతరుల మొబైల్ ఫోన్ల నుంచి ఉన్నతాధికారులకు తోటి సిబ్బందిపై లేనిపోని ఆరోపణలు చేస్తుండడం గమనించి అతడిని సస్పెండ్ చేశారు. వీరిపై సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు.

భర్తను హత్య చేసిన కేసులో జీవితఖైదు

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 3: భర్తను హత్య చేసిన కేసులో భార్యకు జీవిత ఖైదు విధిస్తూ 4వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి అర్చన తీర్పు చెప్పారు. రేణిగుంట బుగ్గవీధికి చెందిన ఎస్.వసుంధర.. 2022 జనవరి 20వ తేదీన ఉదయం 10గంటలకు భర్త రవిచంద్రసూరి తలను నరికి ఓ ప్లాస్టిక్ కవర్‌లో తీసుకొచ్చి రేణిగుంట పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చి లొంగిపోయింది. తన భర్త తనను, మానసిక వైకల్యంతో బాధపడుతున్న కుమారుడి బాగోగులను పట్టించుకోవడమే కాకుండా వివాహేతర సంబంధాలు పెట్టుకున్నాడని తెలిపింది. దీనిపై తరచూ గొడవలు జరిగేవని, ఈ క్రమంలో భర్తను తానే హత్య చేశానని అప్పట్లో చెప్పింది. నేరం నిరూపణ కావడంతో నిందితురాలికి శిక్ష ఖరారు చేశారు. రూ.వెయ్యి జరిమానా కూడా విధించారు.

రుయాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

● వెన్నెముకలో అరుదైన కణితి తొలగింపు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3: లక్ష మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో బాధపడుతున్న 15 ఏళ్ల బాలుడికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతగా నిర్వహించామని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. ఆస్పత్రిలోని తన చాంబర్‌లో ఆయన మంగళవారం మీడియాతో వివరాలు వెల్లడించారు. 'చిత్తూరు జిల్లాకు చెందిన 15 ఏళ్ల బాలుడు రెండు కాళ్లకు పక్షవాతంతో బాధపడుతున్న క్రమంలో రెండు నెలల కిందట కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు వెన్నెముకలో అరుదైన కణితి ఉందని గుర్తించారు. ఇది సాధారణంగా కాకుండా అందులో వెంట్రుకలతో కలిసి ఉండటాన్ని గమనించారు. ఇది లక్షల్లో ఒకరికి వచ్చే టెరాటోమా వ్యాధిగా తేలింది. వెంటనే న్యూరోసర్జన్లు, అనస్థీషియా వైద్యులు శ్రమించి బాలుడి వెన్నెముకలోని కణితిని తొలగించారు. శస్త్ర చికిత్స తర్వాత బాలుడికి ఫిజియోథెరపీ చేయడంతో పూర్తిగా కోలుకోవడంతోపాటు సాధారణంగా నడుస్తున్నాడు' అని రవిప్రభు తెలిపారు. ఇటువంటి సర్జరీలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే చేస్తారని ఇందుకు రూ.లక్షలు ఖర్చవుతాయని చెప్పారు. రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండటంతో ఇటువంటి సర్జరీని విజయవంతంగా చేయగలిగామన్నారు. అసిస్టెంట్ ఆర్ఎంవో హరికృష్ణ, వైద్య నిపుణులు నాగరాజు, అనంత కిరణ్, సుదర్శన్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ గ్రూప్ అడ్మిన్లకు నోటీసులు

చంద్రగిరి, సెప్టెంబరు 3: సుమారు పది వాట్సప్ గ్రూప్ అడ్మిన్లకు చంద్రగిరి పోలీసులు నోటీసులు జారీ చేశారు.ఇటీవల చంద్రగిరిలో ఓ భూవివాదానికి సంబంధించి ఎమ్మెల్యే పులివర్తి నాని, చంద్రగిరి మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు డబ్బులు తీసుకున్నట్లు కొంతమంది వాట్సప్ గ్రూపుల్లో మెసేజీలు పెట్టారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోయినా, రాజకీయ దురుద్దేశంతో నిరాధారమైన ఆరోపణలు చేస్తూ తమ పరువుకు భంగం కలిగించారంటూ సుబ్రమణ్యం నాయుడు వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో ఆయా వాట్సప్ గ్రూప్ అడ్మిన్లకు నోటీసులు జారీ చేశారు. నిరాధారమైన ఆరోపణలు గ్రూపుల్లో ఎవరైన సభ్యులు పోస్టు చేస్తే వాటిని తొలగించకుండా ఉన్నందకు అడ్మిన్లకు నోటీసులు జారీ చేశామని పోలీసులు తెలిపారు. గ్రూపుల్లో పోస్టు చేసిన వారి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని తెలిపారు.

తిరువణ్ణామలైలో రూ.50 కోట్లతో వసతి గృహాలు

● రూ.23 కోట్లతో గిరిప్రదక్షిణ భక్తులకు వసతులు

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలైలో భక్తుల కోసం రూ.50 కోట్లతో వసతి గృహాలు నిర్మించనున్నట్లు తమిళనాడు రాష్ట్ర మంత్రులు ఈవీ వేలు, పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులకు రూ.23 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.గిరి ప్రదక్షిణ మార్గంలో 15 చోట్ల మరుగుదొడ్లు, స్నానపు గదులు, రెండు చోట్ల భక్తులు సేదతీరే కేంద్రాలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. గిరిప్రదక్షిణ మార్గంలో నిర్మించనున్న మరుగుదొడ్లు, స్నానపు గదులు సుమారు 13 అడుగుల ఎత్తులో ఉంటాయని తెలిపారు. ఇక భక్తుల కోసం నిర్మించే వసతి గృహాల వద్ద వాటర్ ఫౌంటైన్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

భార్య కాపురానికి రాలేదని..

● పురుగుల మందుతాగిన భర్త మృతి



మణికంత మృతదేహం

చంద్రగిరి, సెప్టెంబరు 3: భార్య కాపురానికి రాలేదని పురుగుల మందు తాగిన భర్త మృతి చెందాడు. ఎస్ఐ రవీంద్రనాయక్ తెలిపిన వివరాల మేరకు.. దొరవారి సత్రం మండలం మేలనాలత్తూరుకు చెందిన మణికంఠ(25) చంద్రగిరి మండలం ఎం.కొంగరవారిపల్లె బీసీ కాలనీకి చెందిన నందిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఓ కుమారుడు ఉన్నాడు. గొడవల కారణంగా రెండు నెలల కిందట భార్యను అత్తగారింట్లో వదిలి వెళ్లిపోయాడు. తర్వాత కాపురానికి రావాలని పిలవగా.. భార్య రాను అని చెప్పింది. మనస్తాపానికి గురైన అతను గతనెల 24వ తేదీన ఎం.కొంగరవారిపల్లె బీసీ కాలనీకి వచ్చి పురుగుల మందు తాగినట్లు భార్యకు చెప్పాడు. బెదిరిస్తున్నాడని అందరూ భావించారు. కొంతసేపటికే అపస్మారక స్థితికి చేరుకోవడంతో కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడినుంచి స్విమ్స్‌కు తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స కోసం గత నెల 27వ తేదీన చెన్నైలోని రాజీవ్‌గాంధీ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్స పొందుతూ ఈనెల ఒకటో తేదీన మృతి చెందాడు. ఈ ఘటనపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వృద్ధుడి దుర్మరణం

తిరుచానూరు, సెప్టెంబరు 3: వాహనం ఢీకొని ఓ వృద్ధుడు దుర్మరణం చెందాడు. మంగళవారం వేకువజామున కలెక్టరేట్ సమీపంలో ఓ వ్యక్తి(60) హైవేలో రోడ్డు దాటుతుండగా ఏదో వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించి, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిసినవారు 94407 96755 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు.

సంస్కృత వర్సిటీలో స్వచ్ఛత పక్షోత్సవాలు ప్రారంభం



సెల్ఫీబూత్‌ని ప్రారంభిస్తున్న వీసీ కృష్ణమూర్తి తదితరులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 3: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో స్వచ్ఛత పక్షోత్సవాలను మంగళవారం వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ప్రారంభించారు. దీనిలో భాగంగా వర్సిటీలో సెల్ఫీబూత్‌ని ప్రారంభించి.. పరిశుభ్రత-సుస్థిరత అనేఅంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అకడమిక్ డీన్ రజనీకాంత్‌శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ.చందూలాల్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ వైష్ణవి, డాక్టర్ కనపాలకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వనిత, అధ్యాపకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రగిరి సీఐ బదిలీ



సీఐ రామయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

చంద్రగిరి, సెప్టెంబరు 3: చంద్రగిరి సీఐగా విధులు నిర్వహిస్తున్న రామయ్య మంగళవారం బదిలీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో వచ్చిన ఆయన చంద్రగిరిలో ఏడు నెలలపాటు విధులు నిర్వహించారు. ఈయన తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి పోలీస్ స్టేషన్‌లోని ఎస్ఐలు అనిత, రవీంద్రనాయక్, సిబ్బంది ఆయన్ను సన్మానించి, వీడ్కోలు పలికారు. చంద్రగిరి సీఐగా సుబ్బిరామిరెడ్డి రానున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి.

జ్వరం ఉంటే రక్త పరీక్ష చేసుకోండి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 3: జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా రక్తపరీక్షలు చేసుకోవాలని దామినేడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ తెలిపారు. మంగళవారం సాయినగర్ పంచాయతీలోని ఎన్టీఆర్‌కాలనీలో వైద్యసిబ్బందితో కలసి ఇంటింటికీ తిరిగి దోమల లార్వా సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీహెచ్‌వోలు రామకృష్ణ, శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ యశోద, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఏఎన్ఎం సుగుణ, ఆశాకార్యకర్తలు మమత, ప్రవల్లిక తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో అదృశ్యమై....రుయాలో దొరికాడు

● రోగి ఆచూకీ తెలియడంతో ఊపిరి పీల్చుకున్న స్విమ్స్ అధికారులు





సీతారామప్ప నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ రామకృష్ణ - విశ్వనాథ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3 : స్విమ్స్‌లో కనిపించకుండా పోయిన రోగి సీతారామప్ప మంగళవారం రుయాలో ప్రత్యక్షం కావడంతో వారం రోజులుగా ఆయన ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్న స్విమ్స్ అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను కుమారుడు విశ్వనాథ్ గత నెల 27న వైద్యం కోసం స్విమ్స్‌కు తీసుకురావడంతో ఎంఐసీయూ వార్డులో అడ్మిట్ చేసిన విషయం తెలిసిందే. అదేరోజు రాత్రి సీతారామప్ప కన్పించకుండా పోయాడు. స్విమ్స్ అధికారులకు విశ్వనాథ్ తెలిపినా పట్టించుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.29న ఆంధ్రజ్యోతిలో స్విమ్స్‌లో రోగి అదృశ్యం శీర్షికన వార్త ప్రచురితమవడంతో పోలీసుల సహకారంతో స్విమ్స్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.ఐదు రోజుల తరువాత ఆదివారం స్విమ్స్‌లోని సీసీ కెమెరాల్లో సీతారామప్ప ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాలను గుర్తించారు. ఆయన స్వయంగా ఆస్పత్రిలో నుంచి వెళ్లిపోయాడు కాబట్టి తమకేం సంబంధం లేదని స్విమ్స్ అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ నేపథ్యంలో సీతారామప్ప ఎక్కడికి వెళ్లుంటాడనే కోణంలో పోలీసులు, మరో పక్క ఆయన బంధువులు గాలింపు చర్యలను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో సీతారామప్ప రుయాస్పత్రిలో ఉన్నట్లు తెలిసిన వారు విశ్వనాథ్‌కు సమాచారం ఇచ్చారు.దీంతో రుయాకు వెళ్లగా కాలికి బలమైన గాయంతో ఆర్థోవార్డులో చికిత్స పొందుతూ సీతారామప్ప కనిపించాడు. స్విమ్స్‌లో నుంచి వెళ్లిపోయాక ఒక వాహనం సీతారామప్పను ఢీకొట్టడంతో అతడి కాలికి బలమైన గాయం తగిలింది. దీంతో అక్కడున్న కొందరు గత నెల 30న సీతారామప్పను రుయాస్పత్రి అత్యవసర విభాగంలో అడ్మిట్ చేసి వెళ్లిపోయారు.సీతారామప్ప మాట్లాడే పరిస్థితిలో లేకపోవడంతో మొదట రుయాస్పత్రిలోని వైద్యులు గుర్తు తెలియని వ్యక్తిగా రికార్డుల్లో నమోదు చేసుకున్నారు.సీతారామప్ప కోలుకున్న తరువాత తన పేరు మాత్రమే చెప్పి చిరునామా చెప్పేందుకు అంగీకరించకపోవడంతో కేవలం పేరు మాత్రమే నమోదు చేసుకొని అతడిని ఆర్థో వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వార్డులో ఓ స్టాఫ్‌నర్సు సీతారామప్పకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా అతడిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే వెస్ట్ సీఐ రామకృష్ణ రుయాకు చేరుకొని సీతారామప్ప నుంచి వివరాలు సేకరించారు.స్విమ్స్ వైద్యులు అడ్మిట్ చేయాలని చెప్పడంతో తండ్రిని విశ్వనాథ్ ఎంఐసీయూ వార్డుకు తీసుకువెళుతున్న క్రమంలో సీతారామప్ప ఆస్పత్రిలో ఉండలేనని కుమారుడికి చెప్పాడు. దీంతో ఉండకపోతే జబ్బు ఎలా తగ్గుతుంది అని కొడుకు గట్టిగా అరవడంతో నొచ్చుకున్న తాను అదే రోజు రాత్రి ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు సీతారామప్ప వివరించాడు.కాగా సీతారామప్పకు సంబంధించి వరుస కథనాలను ప్రచురించి ఆయన ఆచూకీ లభించేందుకు సాయపడిన ఆంధ్రజ్యోతికి ఆయన కుమారుడు విశ్వనాథ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.



మాధవమాల వుడ్‌కార్వింగ్ సొసైటీలో కళాకారులు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న జీఐ బృందం

టూరిస్టు హబ్‌గా మాధవమాల

● కొయ్యబొమ్మలకు భౌగోళిక గుర్తింపు కోసం జీఐ అధ్యయన బృందం పరిశీలన

ఏర్పేడు, సెప్టెంబరు 3 :ఏర్పేడు మండలంలోని మాధవమాల గ్రామం భవిష్యత్తులో టూరిజం హబ్‌గా తయారు కాబోతుందని జియోలాజికల్ ఐడెంటిటీ (జీఐ) బృందం సభ్యులు పేర్కొన్నారు.మాధవమాల కొయ్యబొమ్మలు భౌగోళిక గుర్తింపు పొందడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు జీఐ నిపుణులు రిసెల్యూట్ సంస్థకు చెందిన శుభాజిత్ సాహో, శ్రీవత్స మంగరాటి మంగళవారం మాధవమాలకు వచ్చారు. గ్రామంలో ఉన్న బాలాజీ వుడ్ కార్వింగ్ సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాధవమాల గ్రామంలో కళాకారులు తయారు చేస్తున్న కొయ్య బొమ్మలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడానికి జీఐ ట్యాగ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దేశంలో 7వుడ్ కార్వింగ్ సొసైటీలకు జీఐ ట్యాగ్‌ను ఇప్పటికే అందించడం జరిగిందని చెప్పారు.బాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీకి జీఐ ట్యాగ్‌ను అందించిన వెంటనే ఆ సంస్థకు, అందులో పనిచేస్తున్న కార్మికులకు ఎన్‌వోసీ సర్టిఫికెట్లను అందిస్తుందని తెలిపారు. వాటిని ఆధారం చేసుకుని కార్మికులు ఏ ప్రాంతంలో అయినా బాలాజీ వుడ్‌కార్వింగ్ సొసైటీ అండర్ టేకింగ్ పేరుతో కొయ్య బొమ్మలు తయారు చేసుకుని అమ్ముకునే వెసులుబాటు ఉంటుందన్నారు.బొమ్మలను మార్కెట్ ధర కంటే ఎక్కువగా అమ్ముకోవడానికి జీఐ దోహదపడుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు భౌగోళిక గుర్తింపు కలిగినవి 19సంస్థలు మాత్రమే ఉన్నాయని, మాధవమాలలో కొయ్యబొమ్మల తయారీవిధానంపై తాము అధ్యయనం చేశామన్నారు.నాలుగు నెలల తరువాత తాము అందించిన అప్లికేషన్‌పై చెన్నై వేదికగా ఆరుగురు సెంట్రల్ సభ్యులు అధ్యయనం చేసి బాలాజీ వుడ్‌కార్వింగ్ సంస్థకు జీఐ గుర్తింపును ఇవ్వడం జరుగుతుందన్నారు.బాలాజీవుడ్ కార్వింగ్ సంస్థ ప్రమోటర్ కృష్ణమూర్తి, సంస్థ అధ్యక్షులు లోకనాథం ఆచారి, కార్యదర్శి రాజాచారి తదితరులు పాల్గొన్నారు.

16నుంచి అమ్మవారి ఆలయంలో పవిత్రోత్సవాలు

తిరుచానూరు, సెప్టెంబరు 3: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఈనెల 16 నుంచి మూడ్రోజులపాటు పవిత్రోత్సవాలు జరగనున్నాయి. 15న సాయంత్రం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం జరుగుతుంది. 16న పవిత్ర ప్రతిష్ఠ, 17న పవిత్ర సమర్పణ, 18న పూర్ణాహుతితో పవిత్రోత్సవాలు ముగియనున్నాయి. రూ.750 చెల్లించి గృహస్తులు(ఒకరికి ఒకరోజు) ఈ పవిత్రోత్సవాల ఆర్జిత సేవల్లో పాల్గొనవచ్చు. గృహస్తులకు 2 లడ్డూలు, 2 వడలు బహుమానంగా అందజేస్తారు. కాగా, ఈనెల 15న అంకురార్పణ సందర్భంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, 16న అష్టదళ పాద పద్మారాధన సేవలను రద్దు చేశారు. అదే విధంగా 16, 17, 18 తేదీల్లో కల్యాణోత్సవం, బ్రేక్ దర్శనం, వేదాశీర్వచనం, కుంకుమార్చన, ఊంజల్‌సేవను టీటీడీ రద్దు చేసింది.

10న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 10వ తేదీన అమ్మవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరగనుంది.



జనసేన జెండా ఆవిష్కరణ

భాకరాపేట, సెప్టెంబరు 3: భాకరాపేటలో జనసేన పార్టీ జెండాను ఆపార్టీ నాయకులు దేవర మనోహర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలను, సేవా కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి, మండల అధ్యక్షుడు కొమ్మిశెట్టి రూపేష్, టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి, టీడీపీ కస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్, తెలుగు మహిళా అధ్యక్షురాలు చిట్టెమ్మ, జిల్లా మహిళా కార్యదర్శి సుజాత, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ దుర్మరణం

చంద్రగిరి, సెప్టెంబరు 3: ట్రాక్టర్ బోల్తాపడటంతో డ్రైవర్ దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశాకు చెందిన భగత్ పూజారి(28) ఐతేపల్లెకు చెందిన శేష ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం ట్రాక్టర్‌లో సిమెంట్ బ్రిక్స్ లోడ్‌తో జగనన్న కాలనీకి వెళుతుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ అనిత సంఘటనా స్థలానికి చేరుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలి: కలెక్టర్



సమావేశంలో ప్రసంగిస్తున్న వెంకటేశ్వర్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 3: డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం రుచిగా, శుచిగా ఉండాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన బడి భోజనం తయారీ ఏజన్సీలు, కుక్‌లు, అక్షయ పాత్ర, ఇస్కాన్ ప్రతినిధులు, ఎడ్యుకేషన్, వెల్ఫేర్ అసిస్టెంట్లు, విద్యాశాఖాధికారులతో సమావేశమయ్యారు. సీజనల్‌గా స్థానికంగా అందుబాటులో ఉండే ఆకుకూరలు, కూరగాయలతో ప్రభుత్వ మెనూమేరకు పిల్లలకు భోజనం పెట్టాలని చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్, ఉప విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగాన్ని పెంచాలి

జిల్లాలో సౌర విద్యుత్ ఉత్పత్తి, వినియోగాన్ని పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో నెడ్ క్యాప్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి దిలీప్‌కుమార్‌రెడ్డితో సమావేశమయ్యారు. కేంద్రప్రభుత్వం తీసుకొచ్చి పీఎం సూర్యఘర్ ముఫ్తీ బిజిలి యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. దీనికోసం తాను చైర్మన్‌గా.. జడ్పీ సీఈవో, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ, నెడ్‌క్యాప్ జిల్లా అధికారి, ఇతర సిబ్బందితో కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచడంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. 5వేల మంది జనాభా కలిగిన ఐదు గ్రామాలను తీసుకుని వాటిని సోలార్ గ్రామాలుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందించాలని ఆదేశాలిచ్చారు.

పవన్ అభిమాని కుటుంబానికి సాయం



రూ.లక్ష చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి కుమారుడు మదన్

రామచంద్రాపురం, సెప్టెంబరు 3: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జన్మదినం సందర్భంగా ఫ్లెక్సీ కడుతూ విద్యుత్ ఘాతంతో మృతిచెందిన అనుప్పల్లె గ్రామ యువకుడు, పవన్ అభిమాని గోపి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనయుడు మదన్ మంగళవారం పాల్గొన్నారు. అనంతరం జేఎంసీ ట్రస్టు తరఫున గోపి తల్లిదండ్రులు రాజేశ్వరి, దామోదరంకు రూ.లక్ష చెక్ అందించారు. అన్ని విధాల అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. జనసేన చంద్రగిరి ఇన్‌చార్జి దేవర మనోహర్, తిరుపతి నాయకులు రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు అనుమతులన్నీ ఒకేచోట

● ప్రారంభించిన కమిషనర్ మౌర్య



మండప నిర్వాహకుడికి దరఖాస్తు అందజేస్తున్న మౌర్య

తిరుపతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వినాయక చవితి సందర్భంగా గణేష్ మండప నిర్వాహకులకు అన్ని అనుమతులు ఒకేచోట (సింగిల్ విండో) అందుబాటులోకి వచ్చే విధానాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రారంభించారు. మంగళవారం ఇందిరా మైదానంలోని ఉత్సవ కమిటీ కార్యాలయంలో మండప నిర్వాహకులకు, సామూహిక నిమజ్జన మహోత్సవానికి చేయాల్సిన ఏర్పాట్ల కోసం పోలీస్, మునిసిపల్, విద్యుత్, ఫైర్ శాఖలకు సంబంధించిన దరఖాస్తులను ఆమె అందజేశారు. ఉత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ.. నగరంలో పండుగను భక్తిపూరితంగా నిర్వహించుకుందామని, సినిమా పాటలు, రికార్డు డ్యాన్సులు, మత్తుపదార్థాలు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ వాసు రెడ్డి, ఈస్టు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేశ్వర్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, కమిటీ ప్రతినిధులు మాంగాటి గోపాల్ రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, రుద్రకోటి సదాశివం, ఆకుల సతీష్, గుండాల గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి



ఎర్రావారిపాళెం, సెప్టెంబరు 3: పంటల సాగు చేసే ప్రతి రైతూ ఈ-పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఎర్రావారిపాళెంలో రైతు సేవ కేంద్రాన్ని సందర్శించి, సిబ్బందితో సమీక్షించారు. ఈనెల 15వ తేదీలోపు ఈ-పంట నమోదు, ఈకేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. తర్వాత ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో జయచంద్ర అనే రైతు సాగు చేసిన వరి, బంతిపూల పొలం వద్ద ఈ-పంట నమోదును పర్యవేక్షించారు. తిరుపతి డివిజన్ ఏడీఏ మనోహర్ బాబు, డీఏవో ఆఫీస్ ఏవో హరిత, వ్యవసాయ అధికారి ఖాదర్ బాష, హార్టికల్చర్ ఆఫీసర్ శివకుమారి, రైతు సేవ కేంద్రం సిబ్బంది మునిశేఖర్, సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

భాకరాపేట, సెప్టెంబరు 3: కుష్ఠువ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా డిప్యూటీ డెమో కిరణ్‌కుమార్ అన్నారు. భాకరాపేట పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా కుష్ఠువ్యాధి లక్షణాలు, నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వైద్యాధికారి అలెగ్జాండర్, వెంకటరమణ, సిబ్బంది శేషు, కుమారి పాల్గొన్నారు.

ఓట్ల పరిశీలనలో నిర్లక్ష్యం వీడండి

రామచంద్రాపురం, సెప్టెంబరు 3: ఓట్ల పరిశీలనలో బీఎల్వోలు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని రామచంద్రాపురం తహసీల్దారు వెంకటరమణ హెచ్చరించారు. మంగళవారం నడవలూరు, నెన్నూరు తదితర గ్రామాల్లో ఇంటింటి ఓటర్ల పరిశీలన కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేశారు. సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, వీఆర్వో వర్మ, బీఎల్వోలు పాల్గొన్నారు.

విమాన ప్రయాణికుడిపై కేసు

ఏర్పేడు, సెప్టెంబరు 3: తిరుపతి విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం బయలుదేరిన ఓ విమానం టేకాఫ్ సమయంలో డోర్ తెరుచుకోవడంతో ఆగిపోయింది. మహారాష్ట్ర పూణేకు చెందిన ప్రయాణికుడు మయూర్ దిలీప్ హోలే(28) డోర్ వద్ద స్విచ్‌ను తాకడంతో అది తెరుచుకుని టేకాఫ్ కాలేదు. దీంతో ప్రయాణికులను విమానాశ్రయ అధికారులు మరో విమానంలో ఎక్కించి పంపారు. స్విచ్‌ను తాకిన ప్రయాణికుడిపై సోమవారం సాయంత్రం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మయూర్ దిలీప్ హోలేను విచారించిన సీఐ జయచంద్రం మంగళవారం కేసు నమోదు చేశారు.

సహకారానికి ఊపిరి

● కూటమి ప్రభుత్వంతో సొసైటీలకు జవసత్వాలు

● నిర్వీర్యం చేసిన గత వైసీపీ ప్రభుత్వం



దామా నెల్లూరు సొసైటీ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 3: సహకార స్ఫూర్తిని దెబ్బతీసింది నాటి వైసీపీ సర్కారు. రైతులకు సేవలందించాల్సిన సొసైటీలను రాజకీయ వేదికలుగా మార్చేసింది. ఆ దెబ్బకు జిల్లాలో సింహభాగం వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్) నిర్వీర్యమైపోయాయి. వీటి దిశను మార్చడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రత్యేకంగా చొరవ తీసుకొని ప్రతి సంఘం రైతులకు ఉపయోగ పడే ఎరువుల వ్యాపారం చేయాలని నిర్దేశించింది. ఇందులో భాగంగా కేంద్రప్రభుత్వం ఎరువుల విక్రయానికి అగ్రికల్చర్ డిప్లొమా అర్హత తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో సొసైటీలోని ఉద్యోగులకు రెండు వారాలపాటు స్వల్పకాలిక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటికే తొలి దశ బృందాలకు శిక్షణ పూర్తయ్యింది. వీరి పేరుతో లైసెన్సులు తీసుకోవడానికి చర్యలు మొదలయ్యాయి. జిల్లాలో ఉన్న 60 పీఏసీఎస్‌లలో ఎరువుల వ్యాపారం ప్రారంభించడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. మార్క్‌ఫెడ్, సెంట్రల్ బ్యాంకు, సహకార, వ్యవసాయశాఖలు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు తొందరలోనే సాకారమవడం ఖాయం.

నాడు పనికిరాకుండా..

జిల్లాలో 60 పీఏసీఎస్‌లు ఉండగా ఇందులో 25నుంచి 30 సొసైటీలు మాత్రమే ఎరువుల వ్యాపారం చేస్తున్నాయి. గతంలో ఈ సంఖ్య 50 వరకు ఉండేది. గత వైసీపీ ప్రభుత్వ చర్యలతో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, రుణాలకు అందించాల్సిన పీఏసీఎస్‌లు నిర్వీర్యమైనాయి. నోడల్ ఏజెన్సీ మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాకు వచ్చిన ఎరువుల్లో 50 శాతం కూడా సరఫరా చేయలేకపోయాయి. రైతుల నుంచి డిపాజిట్ల స్వీకరణ, ఎరువుల వ్యాపారానికి అవసరమైన బ్యాంకు గ్యారంటీలను పొందడం, గోదాములను సిద్ధంగా ఉంచుకోవడం వంటి అంశాలను గాలికొదిలేసింది నాటి వైసీపీ సర్కార్. ఆ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ఆ పార్టీ నాయకులనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించడంతో సూళ్లూరుపేట, తడ, నాయుడుపేటల్లోసింహభాగం పీఏసీఎస్‌లు అచేతనంగా మిగిలిపోయాయి.

రైతులపై భారం లేకుండా...

సొసైటీల ద్వారా ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేస్తే రైతులపై భారం తగ్గుతుంది. పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేసే ఎరువులకు రవాణా చార్జీలు కంపెనీలే చెల్లిస్తాయి. సహకార సంఘాలకు ఆయా కంపెనీలు ఎమ్మార్పీకే నేరుగా ఎరువులను సరఫరా చేస్తాయి. అదే ప్రైవేట్ వ్యాపారులకైతే రవాణా చార్జీలు చెల్లించవు. కాకినాడ, కృష్ణపట్నం, గుంటూరు దూర ప్రాంతాల నుంచి ఎరువులు వస్తే బస్తాపై దాదాపు రూ.50 నుంచి రూ.70 వరకు అదనంగా రవాణా భారం పడుతోంది ఈ మొత్తాన్ని వ్యాపారులు రైతుల నుంచే వసూలు చేసేవారు. అదే సొసైటీల నుంచి రవాణా అయితే రైతులకు అదనపు భారం పడదు.



మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి, సైబర్ క్రైమ్ మోసాల పట్ల జాగ్రత్త వహించండి, మహిళలపై అఘాయిత్యాలు నివారిద్దాం, ట్రాఫిక్ రూల్స్ పాటించండి, హెల్మెట్ ధరించండి అంటూ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీలు, డీఎస్పీలు

తిరుమలలో మహారథానికి మెరుగులు

తిరుమల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్య ఘట్టమైన మహారథోత్సవానికి చెక్కతేరు సిద్ధమవుతోంది. అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఈక్రమంలో మాడవీధుల్లో శ్రీవారి ఉత్సవమూర్తులు ఊరేగే అన్ని వాహనాలను టీటీడీ సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా చెక్కతేరును కూడా అధికారులు సిద్ధం చేస్తున్నారు. దాదాపు 600 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ మహారథం (చెక్కతేరు)పై శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి కొలువుదీరి భక్తకోటిని కటాక్షించనున్నారు. రథంలో ఆశీనులైన స్వామిని దర్శించుకుంటే పునర్జన్మ ఉండదని శాస్త్రవచనం. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవ తర్వాత అంతటి ప్రాధాన్యం మహారథానికి ఉంటుంది. ఈ క్రమంలో భారీ ఎత్తు, బరువుతో కూడిన చెక్కతేరు ఊరేగింపులో ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో టీటీడీ పనులు మొదలుపెట్టింది. ఇప్పటికే చెక్కతేరుకు చుట్టుపక్కల ఉన్న ఇనుపరేకులను తొలగించిన అధికారులు చెక్కల పటిష్ఠతను పరిశీలిస్తున్నారు. ఏడాదిపాటు రేకుల మధ్య ఎలాంటి కదలికలు లేకుండా ఉన్న క్రమంలో చక్రలను కూడా పరిశీలించనున్నారు. తర్వాత పెయింటింగ్ పనులు చేపట్టి బ్రేకులు, ఇతర కదలికలు, శబ్దాలు వస్తున్న ప్రదేశాల్లో చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్యలు తీసుకోనున్నారు.



శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.55 కోట్లు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.55 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 63,936 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 18,697 మంది తలనీలాలు సమర్పించారు.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు

తిరుపతి (జీవకోన),సెప్టెంబరు3:రాష్ట్రంలోని 1,047దేవాలయాల్లో పాలకమండలి సభ్యులుగా బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు అవకాశం కల్పించిన కూటమి ప్రభుత్వానికి పీపుల్స్ ఉమెన్ రైట్స్ కమిటీ స్టేట్ ప్రెసిడెంట్ లావణ్య పాల్గాట్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. పీస్ రేట్ కల్యాణకట్ట క్షురకులకు రూ.25వేల వరకు జీతం పెంచడం హర్షణీయమన్నారు. ఇచ్చిన మాట నిలుపుకున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలన్నారు. బ్రాహ్మణులు మురళి, వెంకటేశ్వర్లు, శ్వేత, నాయీ బ్రాహ్మణులు గుండ్లూరు ప్రసాద్, నిరంజన్, శిల్పాచారి తదితరులు పాల్గొన్నారు.

'భూకబ్జా జరగలేదు.. ఆరోపణలన్నీ అవాస్తవం'

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 3: కేవీబీపురం మండలం రాయపేడులో 48 సెంట్ల స్థలాన్ని కబ్జా చేస్తున్నారంటూ ఉపాధ్యాయుడు మావిళ్లయ్య చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని అదే గ్రామానికి చెందిన దళితసంఘం నాయకుడు డాక్టర్ పి.రమేష్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గ్రామస్తులతో కలిసి మీడియాతో మాట్లాడారు. మావిళ్లయ్య పూర్వీకులు ఆ స్థలాన్ని లూథరన్ చర్చి వ్యవస్థాపకుడు డోర్నర్‌కు విక్రయించారని, దీనికి సంబంధించిన పత్రాలన్నీ ఉన్నాయని అన్నారు. ఈ స్థలంపై పంచాయితీ ఎమ్మెల్యే ఆదిమూలం వద్దకు వెళ్లగా, న్యాయ ప్రకారం నడుచుకోవాలని ఆయన సూచించారన్నారు. దాంతో ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. 2019 ఎన్నికల్లో టీడీపీకి మద్దతు తెలిపామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారి కుటుంబమంతా వైసీపీకి పనిచేసిందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల మాజీ ఎంపీపీ వెట్టి సుబ్రహ్మణ్యం, పాస్టర్ చటర్జీ, ఏయుమలై, మాజీ సర్పంచ్ సురేష్‌రెడ్డి, అశోక్, మాజీ ఎంపీటీసీ శివలింగం, జనసేన నాయకులు థామస్, దొరస్వామి తదితరులు పాల్గొన్నారు.



కరాటే పోటీల్లో తిరుపతి కుర్రోళ్ల ప్రతిభ



తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 3: అంతర్ జిల్లాల కరాటే పోటీల్లో తిరుపతికి చెందిన క్రీడాకారులు ప్రతిభ చూపారు. గత ఆదివారం ఒంగోలులో జరిగిన ఈ పోటీల్లో నగరానికి చెందిన నవీన్ మార్షల్ ఆర్ట్స్ తరఫున అండర్ 7నుంచి 19 విభాగాల వరకు మొత్తం 70మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. కటా విభాగంలో.. 8మందికి బంగారం, పదిమందికి రజతం, ఐదుగురికి కాంస్యం. కుమితే విభాగంలో.. 12మందికి బంగారం, పదిమందికి రజతం, 15మందికి కాంస్య పతకాలు లభించాయి. ఈ సందర్భంగా శిక్షకుడు నవీన్‌ను, క్రీడాకారులను పలువురు అభినందించారు.

ఇంటింటి సర్వే పక్కాగా చేయాలి

తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మౌర్య

తిరుపతి, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓట్ల మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం నిర్వహించే ఇంటింటి సర్వే పక్కాగా చేయాలని తిరుపతి నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి నారపరెడ్డి మౌర్య ఆదేశించారు. సర్వేపై మంగళవారం కచ్చపి ఆడిటోరియంలో సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ ఆఫీసర్లతో జరిగిన సమావేశంలో ప్రసంగించారు. డూప్లికేట్, షిఫ్టింగ్, మరణించిన ఓట్లలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారికి 18 సంవత్సరాలు నిండి ఉండాలని, అన్ని ధ్రువపత్రాలు పరిశీలించాలని చెప్పారు. తప్పులు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

నేడు రాస్‌లో చిరుధాన్యాల మేళా

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు 3: తిరుపతి అన్నమయ్య మార్గంలోని రాస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు చిరుధాన్యాలు, సేంద్రియ ఎరువుల ఉత్పత్తుల మేళా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రామకుమార్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

9న తిరుమలనంబి అవతార మహోత్సవం

తిరుమల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవాచార్యులు తిరుమలనంబి 1051వ అవతార మహోత్సవం ఈనెల 9వ తేదీన తిరుమలలోని దక్షిణమాడవీధిలో ఉన్న తిరుమలనంబి ఆలయంలో నిర్వహించనున్నారు. ఆలయంలో ఉదయం 9.30 గంటలనుంచి 16 మంది ప్రముఖ పండితులు తిరుమలనంబి జీవిత చరిత్రపై ఉపన్యసించనున్నారు. శ్రీవారి భక్తాగ్రేసరుల్లో ఒక్కరైన తిరుమలనంబి శ్రీవారికి తీర్థకైంకర్యం ప్రారంభించారు. ఆయన భగవద్రామనుజులకు స్వయాన మేనమామ, గురుతుల్యులు. వీరు రామానుజుల వారికి రామాయణ పఠనం చేశారని పురాణాల ద్వారా తెలుస్తోంది.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచండి

విజయవాడలో సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు



పాయకాపురంలో పనులను పరిశీలిస్తున్న సంతోషరావు

తిరుపతి (ఆటోనగర్), సెప్టెంబరు 3: విజయవాడలో జరుగుతున్న విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు ఆదేశించారు. తుఫాను కారణంగా విజయవాడ పాయకాపురంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో తిరుపతి విద్యుత్ సర్కిల్ బృందాలు అక్కడకు చేరుకుని పునరుద్ధరణ పనులు ప్రారంభించాయి. ఈ పనులను మంగళవారం సీఎండీ పరిశీలించారు. ఈ ప్రాంతాన్ని సీఎం చంద్రబాబు కూడా సందర్శించారని తెలిపారు. సీపీడీసీఎల్ సీఎండీ రవి, జెన్‌కో సీఎండీ చక్రధరరావు, ఈఈ వాసురెడ్డి తదితరులున్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు



పళనిస్వామి

తిరుమల, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి పళనిస్వామి వేకువజామున ఆలయంలో జరిగిన తోమాల సేవలో పాల్గొని దర్శించుకున్నారు. అలాగే శ్రీసిటీ ఎండీ రవీంద్రాసన్నారెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే రామకృష్ణ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి లడ్డూప్రసాదాలు అందజేశారు.

వెంకన్న ఆలయంలో ఏఈవోల బదిలీలు

తిరుమల శ్రీవారి ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఏఈవోలు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆలయం పేష్కార్‌గా పనిచేస్తున్న శ్రీహరిని వైకుంఠం క్యూకాంప్లెక్స్2 ఈవోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో గతంలో తిరుమల రిసెప్షన్ ఓఎస్డీగా, ప్రస్తుతం ట్రెజరీ ఏఈవోగా పనిచేస్తున్న రామకృష్ణను నియమించారు. అలాగే శ్రీవారి ఆలయ పోటు పేష్కార్‌గా ఉన్న శ్రీనివాసులును హెడ్‌డీపీపీ ఈవోగా బదిలీ చేశారు. ఈస్థానంలో తిరుపతి రెవెన్యూ విభాగంలో ఏఈవోగా ఉన్న మునిరత్నంను నియమించారు. వీరు త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

సమాఖ్య డబ్బులు కొట్టేసిన గ్రూప్ లీడర్

మహిళా సంఘాల సభ్యుల ఆరోపణ



తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 3: తాతయ్యగుంట కట్ట వద్ద ఉన్న సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులకు సంబంధించిన సమాఖ్య డబ్బులను గ్రూప్ లీడర్ ఇందిర కొట్టేశారని వారు ఆరోపించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమ రెండు సంఘాలకు తెలియకుండానే బైరాగిపట్టెడ వద్ద ఉన్న ఇండియన్ బ్యాంకులో సభ్యుల పేర్లతో రుణాలు తీసుకోవడంతోపాటు సమాఖ్య డబ్బులను కూడా కొట్టేశారన్నారు. ఇందిరతోపాటు మరో లీడర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి ఇదంతా చేసినట్లు వాపోయారు. ఉన్నతాధికారులు విచారించి, న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సభ్యులు కవిత, వాణి, చంద్రకళ, సుబ్బలక్ష్మి, దేవి, శివరంజని, జానకి, శారద, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఏఈల నియామకాలు చేపట్టండి



సాంబశివరావుకు పుష్పగుచ్ఛమిస్తున్న నాయకులు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 3: రాష్ట్ర విద్యుత్ సంస్థల్లోని ఏఈల ఖాళీలను భర్తీ చేయాలని ఏపీఎస్ఈబీ ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకులు కోరారు. మంగళవారం ఇంధన శాఖ మంత్రి ఓఎస్డీ సాంబశివరావు తిరుపతికి వచ్చిన నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు యు.రమేష్‌బాబు, పి.బాలాజి మాట్లాడుతూ.. గత పే రివిజన్‌లో ఇంజనీర్లకు అన్యాయం జరిగిందని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీఎస్పీడీసీఎల్ సీజీఎం పి.అయూబ్‌ఖాన్, ఈఈలు పి.రవికుమార్, కె.జయప్రకాష్, డి.భాస్కర్‌నాయుడు, కె.స్వాతి, కె.మునిప్రసాద్. టి.వెంకటలక్ష్మి, జి.రమేష్, సి.బాలాజి పాల్గొన్నారు.

11న ఐటీఐ విద్యార్థులకు అప్రెంటీస్‌షిప్ మేళా

తిరుపతి(విద్య), సెప్టెంబరు 3: ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటీస్ షిప్ మేళా ఈనెల 11వ తేదీన తిరుపతి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డెవలప్‌మెంట్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వారి ఆధ్వర్యంలో ఈ మేళా జరగనుంది. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో ఐటీఐ ఉత్తీర్ణులైనవారు అర్హులు. ఆసక్తి ఉన్నవారు 11వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరుకావాలి.

అంగన్వాడీల బతుకులు మారలేదు

తిరుపతి,(ఆటోనగర్), సెప్టెంబరు 3: ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారలేదని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన భవన్‌లో మంగళవారం జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆమె ప్రసంగించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెరగలేదన్నారు. పాలక ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకులు కేఎస్ఎన్ ప్రసాదరావు, ఎస్.వాణిశ్రీ, పద్మలీల, నాగరాజమ్మ, ధనమ్మ, రాజేశ్వరి, స్వరూపారాణి, మంజుల, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

మల్టీ లెవెల్ పార్కింగ్, క్రికెట్ గ్రౌండ్లకు నిధులు తీసుకొస్తా : మాజీ ఎంపీ



మౌర్యకు వినతిపత్రం అందజేస్తున్న వరప్రసాద్ తదితరులు

తిరుపతి (ఉపాధ్యాయ నగర్), సెప్టెంబరు 3: తిరుపతి మున్సిపల్ కాంప్లెక్స్ మల్టీ లెవెల్ పార్కింగ్, క్రికెట్ గ్రౌండ్లకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తిరుపతి మాజీ ఎంపీ, బీజేపీ నాయకుడు వరప్రసాద్ అన్నారు. కూటమి నాయకులతో కలిసి మంగళవారం తుడా వీసీ, కార్పొరేషన్ కమిషనర్ మౌర్యను తుడాల కార్యాలయంలో వినతిపత్రమిచ్చారు. అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చేందుకు కూటమి నాయకులందరూ పాటుపడతామని చెప్పారు. బీజేపీ సీనియర్ నాయకులు జల్లి మధుసూదన్, పెనుబాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన శ్రీవారి లడ్డూల నిల్వలు

సమాచార కేంద్రాలకు తరలించిన టీటీడీ

తిరుమల, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): టీటీడీ నూతన విధానంతో తిరుమల శ్రీవారి లడ్డూల నిల్వలు పెరిగాయి. శ్రీవారిని దర్శించుకునే భక్తులకు ఓ ఉచిత లడ్డూతో పాటు లభ్యతను బట్టి 4 నుంచి 6 లడ్డూలు ఇవ్వాలని, శ్రీవారిని దర్శించుకోకుండా బయటనుంచి వచ్చే వ్యక్తులకు ఆధార్ కార్డుపై రోజువారీ రెండు లడ్డూలు మాత్రమే ఇవ్వాలని టీటీడీ నిర్ణయించిన విషయం తెలిసిందే.ఈ నూతన విధానంతో లడ్డూ దళారీలు కూడా తగ్గుతారని టీటీడీ ప్రకటించింది.ఈ నూతన విధానాన్ని గత గురువారం నుంచి అమలుచేస్తున్నారు. అయితే గత మూడురోజుల నుంచి భారీ వర్షాల నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య తగ్గింది. భక్తుల సంఖ్య తక్కువ కావడం, బయట వ్యక్తులకు ఆధార్‌పై రెండు మాత్రమే విక్రయిస్తున్న క్రమంలో మూడు రోజుల నుంచి తయారుచేస్తున్న లడ్డూల నిల్వలు పెరిగాయి. దీంతో మంగళవారం ఉదయం నుంచి శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు కోరినన్ని లడ్డూలు విక్రయిస్తున్నారు. లడ్డూల నిల్వ అధికంగా ఉండడంతో టీటీడీ అధికారులు చెన్నై, బెంగుళూరుల్లో వున్న టీటీడీ సమాచార కేంద్రాలకు, అనుబంధ ఆలయాలకు విక్రయాల కోసం 50 వేలకుపైగా లడ్డూలను పంపారు. అలాగే భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలకూ లడ్డూలను పంపాలని టీటీడీ భావిస్తోంది.

'యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన' పుస్తక పరిచయ సభ నేడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 3: ప్రఖ్యాత నవలా రచయిత్రి యద్దనపూడి సులోచనారాణి సాహిత్య వివేచన పుస్తక పరిచయ సభ బుధవారం తిరుపతిలో నిర్వహించనున్నారు. ఎస్వీయూ తెలుగు విభాగం - ఓఆర్ఐ విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి. ఎస్వీయూ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో మధ్యాహ్నం మూడు గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సభకు ఆకాశవాణి మాజీ సంచాలకుడు నాగసూరి వేణుగోపాల్ అధ్యక్షత వహిస్తారు. ఇన్‌చార్జి వీసీ అప్పారావు, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ డాక్టర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, తెలుగు విభాగాధిపతి ఆచార్య ఆర్.రాజేశ్వరమ్మ, ఓఆర్ఐ డైరెక్టర్ ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు పాల్గొంటారు.

వరద బాధితులను టీటీడీ, శ్రీకాళహస్తి దేవస్థానాలు ఆదుకోవాలి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3: 'రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలకు పలుచోట్ల కొన్ని వేల మంది వరద ముంపులో చిక్కుకొని బిక్కుబిక్కుమంటున్నారు. అలాంటి వారిని ఆదుకునేందుకు టీటీడీ, శ్రీకాళహస్తి దేవస్థానాలు ముందుకు రావాలి' అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. తక్షణమే టీటీడీ రూ.10 కోట్లు, శ్రీకాళహస్తి దేవస్థానం రూ.5కోట్ల నిధులను మంజూరు చేయాలన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో విజయవాడ, గుంటూరు, ఉభయ గోదావరి జిల్లాల్లో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ధార్మిక, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చి వరద బాధితులకు అండగా నిలవాల్సిన సమయమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మొదలు ప్రజాప్రతినిధుల వరకు వారి నెల జీతాన్ని బాధితులకు సాయంగా అందించాలన్నారు. టీటీడీ, ప్రభుత్వ ఉద్యోగులు వారి ఒక్క రోజు వేతనాన్ని కూడా వరద బాధితులకు సాయంగా ఇస్తే కొంత ఊరటగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడంలో ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఇద్దరూ మంచి అడ్మినిస్ట్రేటర్లు అని ప్రశంసించారు.

పరిశోధనా పురస్కారాలకు అధ్యాపకుల ఎంపిక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 3: పద్మావతి మహిళా యూనివర్సిటీలో పనిచేస్తున్న అధ్యాపకులను పరిశోధనా పురస్కారాల కోసం ఎంపిక చేశారు. గురువారం నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవంలో వీరికి పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. ఇంగ్లీషు ప్రొఫెసర్ నిర్మల, సిరికల్చర్ ప్రొఫెసర్ సావిత్రి ఆచార్య రత్నకుమారి పురస్కారానికి ఎంపికయ్యారు. జర్నలిజం ప్రొఫెసర్ శోభారాణి, సిరికల్చర్ ప్రొఫెసర్ సుజాతమ్మ ట్రాన్స్‌లేషనల్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఫార్మసీ ప్రొఫెసర్ విద్యావతి, సిరికల్చర్ అధ్యాపకురాలు హేమావతి, ఎంబీఏ స్కాలర్ శాంతిప్రియలకు రిటైర్డు ప్రొఫెసర్ జ్యోతి పేరుతో పురస్కారాలు అందజేస్తారు. ఎంపికైన వారిని ఇన్‌చార్జి వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని అభినందించారు.

రేణిగుంట డీఎస్పీగా మురళీధర్?

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 3: రేణిగుంట డీఎస్పీగా మురళీధర్ నియమితులు కానున్నట్లు సమాచారం. ఇప్పటివరకు పనిచేసిన వెంకటాద్రికి అదనపు ఎస్పీగా పదోన్నతి లభించిన విషయం తెలిసిందే. దీంతో గతంలో రేణిగుంట రూరల్ సీఐగా, తిరుపతి క్రైం, ఎస్సీ, ఎస్టీ సెల్‌లో డీఎస్పీగా పనిచేసిన మురళీధర్ ప్రస్తుతం విశాఖపట్నం ప్రాంతంలో డీఎస్పీగా పనిచేస్తున్నాడు. ఈయన రేణిగుంట డీఎస్పీగా రానున్నట్లు తెలిసింది. కాగా.. ఈ పోస్టుకు మరో ఇద్దరు డీఎస్పీలు తీవ్రంగా పోటీ పడుతున్నట్లు సమాచారం.



మోదీ పాలనలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయి

సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి



ఆర్డీవో కార్యాలయం వద్ద సీపీఐ నాయకుల నిరసన

సూళ్లూరుపేట, సెప్టెంబరు 3: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లేక రైతుల ఆత్మహత్యలు పెరిగిపోయాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి అన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో పెరిగిన ధరలు, గిట్టుబాటు ధరలపై ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేశారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ... పదేళ్ల మోదీ పాలనలో రికార్డు స్థాయిలో నిత్యావసర ధరలు, రైతుల ఆత్మహత్యలు పెరిగాయన్నారు. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. పెట్రోలు, డీజిల్ ధరలు పెంచి సామాన్యుడి నడ్డి విరిచారన్నారు. సామన్యులు జీవ నం సాగించలేని పరిస్థితిలో ఉంటే దేశం వెలిగిపోతుందని ప్రగల్భాలు పలు కుతున్నారని విమర్శించారు. ఎం.పార్థసారథి, సుధాకర్ రెడ్డి, ఆనంద్, సత్యవేడు నియోజకవర్గ సీపీఐ నాయకుడు చిన్నిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడితో ఓజిలి నేతల భేటీ


నాయకులతో నరసింహయాదవ్ పిచ్చాపాటీ

ఓజిలి, సెప్టెంబరు 3: మండలంలో పార్టీ పూర్వ వైభవం సంతరించుకునేలా నాయకులు పనిచేయాలని తిరుపతి జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ పిలుపునిచ్చారు. నాయుడుపేట పట్టణంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన్ను జి.మధుసూదన్‌రెడ్డి, కె.గోపాల్‌రెడ్డి, బి.రవీంద్రారెడ్డి, కె.ఫణీంద్రారెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలసి మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎస్ఎంసీ ఎన్నికలతోపాటు ఓజిలి మండలం పార్టీ పరిస్థితులను ఆయన అడిగి తెలుసుకున్నారు. పార్టీని బలోపేతం చేసేలా కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండాలని ఈ సందర్భంగా నరసింహయాదవ్ సూచించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం కూడా పాల్గొన్నారు.

త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలి


మరమ్మతులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, సెప్టెంబరు 3: పట్టణానికి తాగునీరు అందించే పైపులైన్ల మరమ్మ తులను త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని వేములపాళెం సమీపంలో జరుగుతున్న తాగునీటి సరఫరా పైపులైన్ మరమ్మతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పైపులైన్లు మరమ్మతులకు గురికావడంతో పట్టణవాసులకు తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదన్నారు. పనులను వేగవంతంగా పనులను పూర్తిచేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్త్ క్లినిక్ ప్రారంభం


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న నాయకులు

వాకాడు, సెప్టెంబరు 3: మండలంలోని కొండూరు సచివా లయం పరిధిలో ఉన్న హెల్త్ క్లినిక్ సెంటర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు అభిమానులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. శ్రీసిటీలో పనిచేస్తున్న తీరప్రాంత వాసుల సౌకర్యార్థం తూపిలిపాళెం, కొండూరు, వయా తూపిలి, వాకాడు, చిట్టమూరు మీదుగా శ్రీసిటీకి వెళ్లే బస్సును ఎమ్మెల్యే ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు డి.మధు సూదన్‌రెడ్డి, ఎస్.విజయశేఖర్‌రెడ్డి, పి.పురుషోత్తమరెడ్డి, కె.నందగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు: విజయశ్రీ


ఎస్ఎంసీ చైర్మన్‌ను సన్మానిస్తున్న విజయశ్రీ

నాయుడుపేట, సెప్టెంబరు 3: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే విజయశ్రీ అన్నారు. పట్టణంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎస్ఎంసీ కమిటీల అభినందన సభ ను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎస్ఎంసీ కార్యవర్గం పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ... విద్యాకమిటీలతో పాఠశాలల్లో వసతుల కల్పన మెరుగుపడుతుందన్నారు. అనంతరం ఎస్ఎంసీ చైర్మన్లను సన్మానించారు. నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి పరసా రత్నం, ఎస్.విజయభాస్కర్‌రెడ్డి, టి.సుధాకర్‌రెడ్డి, పళణి, సెల్వం, ఎం.రాజశేఖర్, రఫి తదితరులు పాల్గొన్నారు.

విమాన ప్రయాణికుడిపై కేసు

ఏర్పేడు, సెప్టెంబరు 2: తిరుపతి విమానాశ్రయం నుంచి సోమవారం ఉదయం బయలుదేరిన ఓ విమానం టేకాఫ్ సమయంలో డోర్ తెరుచుకోవడంతో ఆగిపోయింది. మహారాష్ట్ర పూణేకు చెందిన ప్రయాణికుడు మయూర్ దిలీప్ హోలే(28) డోర్ వద్ద స్విచ్‌ను తాకడంతో అది తెరుచుకుని టేకాఫ్ కాలేదు. దీంతో ప్రయాణికులను విమానాశ్రయ అధికారులు మరో విమానంలో ఎక్కించి పంపారు. స్విచ్‌ను తాకిన ప్రయాణికుడిపై సోమవారం సాయంత్రం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మయూర్ దిలీప్ హోలేను విచారించిన సీఐ జయచంద్రం మంగళవారం కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి మృతి


దీపిక మృతదేహం

వాకాడు, సెప్టెంబరు 3: కడుపునొప్పితో గర్భిణి మృతి చెందింది. మండలంలోని నెల్లిపుడికి చెందిన మస్తాన్ భార్య దీపిక (24) ఆరు నెలల గర్భిణి. సోమవారం రాత్రి 10.30 గంటలకు కడుపునొప్పిగా ఉందని భర్తకు చెప్పడంతో కోట పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆరోగ్యం కదుట పడడంతో నెల్లిపుడికి చేరుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు మళ్లీ నొప్పి తిరగతోడడంతో ఆమెను వాకాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. వైద్యులు సుమారు గంటకు పైగా వైద్యం అందించినప్పటికీ దీపిక మృతి చెందింది. దీంతో వైద్యసిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. అలాగే సమాచారం అందుకున్న దీపిక కుటుంబసభ్యులు సంఘటనా స్థలికి చేరుకొని విగతజీవిగా పడి ఉన్న తమ బిడ్డను చూసి కన్నీరుమున్నీరయ్యారు. ప్రతిరోజు తమతో ఫోన్‌లో మాట్లాడేదని, సోమవారం ఫోన్ చేయలేదని చెప్పారు. తమ బిడ్డ మృతిపై అనుమానాలున్నాయంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్ఐ నాగబాబు మాట్లాడుతూ... పోస్టుమార్టం నివేదిక వచ్చాక వివరాలు తెలుస్తాయని చెప్పారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

కోట, సెప్టెంబరు 3: ప్రభుత్వం పొదుపు సంఘాల ఆర్థికాభివృద్ధి కోసం ప్రవేశపెడుతున్న పథకాలు, రాయితీలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఏపీఎం రత్నయ్య శ్రీనిధి మేనేజర్ జయకుమార్‌ను కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సంక్షేమ పథకాల తీరుతెన్నులపై మంగళవారం వీవోఏలు, సీసీలతో ఆయన సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా రత్నయ్య, జయకుమార్ మాట్లాడుతూ... 2024-25 ఆర్థిక సంవత్సరానికి శ్రీనిధి రుణాలు విరివిగా రానున్నాయన్నారు. 2023-24లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి మలివిడత పొందాలన్నారు. ఈ సమావేశంలో సీసీలు కృష్ణమ్మ, శ్రీకాంత్, శంకర్, ప్రసాద్, భాస్కర్, బిందు తదితరులు పాల్గొన్నారు.

సహకారానికి ఊపిరి

- కూటమి ప్రభుత్వంతో సొసైటీలకు జవసత్వాలు
- నిర్వీర్యం చేసిన గత వైసీపీ ప్రభుత్వం



సూళ్లూరుపేట, సెప్టెంబరు 3: సహకార స్ఫూర్తిని దెబ్బతీసింది నాటి వైసీపీ సర్కారు. రైతులకు సేవలందించాల్సిన సొసైటీలను రాజకీయ వేదికలుగా మార్చేసింది. ఆ దెబ్బకు జిల్లాలో సింహభాగం వ్యవసాయ సహకార పరపతి సంఘాలు(పీఏసీఎస్) నిర్వీర్యమైపోయాయి. వీటి దిశను మార్చడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ప్రత్యేకంగా చొరవ తీసుకొని ప్రతి సంఘం రైతులకు ఉపయోగ పడే ఎరువుల వ్యాపారం చేయాలని నిర్దేశించింది. ఇందులో భాగంగా కేంద్రప్రభుత్వం ఎరువుల విక్రయానికి అగ్రికల్చర్ డిప్లొమా అర్హత తప్పనిసరి చేసింది. ఈ నేపథ్యంలో సొసైటీలోని ఉద్యోగులకు రెండు వారాలపాటు స్వల్పకాలిక శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇప్పటికే తొలి దశ బృందాలకు శిక్షణ పూర్తయ్యింది. వీరి పేరుతో లైసెన్సులు తీసుకోవడానికి చర్యలు మొదలయ్యాయి. జిల్లాలో ఉన్న 60 పీఏసీఎస్‌లలో ఎరువుల వ్యాపారం ప్రారంభించడానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధమైంది. మార్క్‌ఫెడ్, సెంట్రల్ బ్యాంకు, సహకార, వ్యవసాయశాఖలు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వం ఆశించిన ఫలితాలు తొందరలోనే సాకారమవడం ఖాయం.

నాడు పనికిరాకుండా..

జిల్లాలో 60 పీఏసీఎస్‌లు ఉండగా ఇందులో 25నుంచి 30 సొసైటీలు మాత్రమే ఎరువుల వ్యాపారం చేస్తున్నాయి. గతంలో ఈ సంఖ్య 50 వరకు ఉండేది. గత వైసీపీ ప్రభుత్వ చర్యలతో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, రుణాలకు అందించాల్సిన పీఏసీఎస్‌లు నిర్వీర్యమైనాయి. నోడల్ ఏజెన్సీ మార్క్‌ఫెడ్ ద్వారా జిల్లాకు వచ్చిన ఎరువుల్లో 50 శాతం కూడా సరఫరా చేయలేకపోయాయి. రైతుల నుంచి డిపాజిట్ల స్వీకరణ, ఎరువుల వ్యాపారానికి అవసరమైన బ్యాంకు గ్యారంటీలను పొందడం, గోదాములను సిద్ధంగా ఉంచుకోవడం వంటి అంశాలను గాలికొదిలేసింది నాటి వైసీపీ సర్కార్. ఆ సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా ఆ పార్టీ నాయకులనే పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించడంతో సూళ్లూరుపేట, తడ, నాయుడుపేటల్లోసింహభాగం పీఏసీఎస్‌లు అచేతనంగా మిగిలిపోయాయి.

రైతులపై భారం లేకుండా...

సొసైటీల ద్వారా ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేస్తే రైతులపై భారం తుగ్గుతుంది. పీఏసీఎస్‌ల ద్వారా పంపిణీ చేసే ఎరువులకు రవాణా చార్జీలు కంపెనీలే చెల్లిస్తాయి. సహకార సంఘాలకు ఆయా కంపెనీలు ఎమ్మార్పీకే నేరుగా ఎరువులను సరఫరా చేస్తాయి. అదే ప్రైవేట్ వ్యాపారులకైతే రవాణా చార్జీలు చెల్లించవు. కాకినాడ, కృష్ణపట్నం, గుంటూరు దూర ప్రాంతాల నుంచి ఎరువులు వస్తే బస్తాపై దాదాపు రూ.50 నుంచి రూ.70 వరకు అదనంగా రవాణా భారం పడుతోంది ఈ మొత్తాన్ని వ్యాపారులు రైతుల నుంచే వసూలు చేసేవారు. అదే సొసైటీల నుంచి రవాణా అయితే రైతులకు అదనపు భారం పడదు.

నేడు దువ్వూరు ఆత్మీయ సమావేశం

వైసీపీ అసమ్మతి నాయకులకు ఆహ్వానం ● సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల దారేటో?

తడ, సెప్టెంబరు 3: సూళ్లూరుపేట వైసీపీకి దెబ్బమీద దెబ్బ తగలనుంది. ఇప్పటికే పార్టీకి రాజీనామా చేసిన చెంగాళమ్మ ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి వెంట పెద్ద ఎత్తున వైసీపీ నాయకులు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ మేరకు బుధవారం దొరవారిసత్రం మండలం మైలాంగంలో ఆత్మీయ సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసి 2014, 2019 ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన తనకు అవమానాలే ఎదురయ్యాయని భావించిన బాలచంద్రారెడ్డి ఆ పార్టీకి తన సత్తా చూపించాలనే ఉబలాటంతో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇక్కడే పార్టీ మార్పుపై ప్రకటన చేయనున్నట్లు సమాచారం. సూళ్లూరుపేట, దొరవారిసత్రం, నాయుడుపేట, తడ, పెళ్లకూరు మండలాల నుంచి వైసీపీ నాయకులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పలువురు సర్పంచులు ఈ సమావేశానికి హాజరుకానున్నట్లుగా సమాచారం.

టీడీపీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్?

మరో వైపు దువ్వూరు చేరికకు టీడీపీ అధిష్ఠానం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు సమాచారం. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి, మంత్రి లోకేశ్ సమక్షంలో ఆయన పార్టీలో చేరుతారంటూ ప్రచారం జరుగుతోంది. ఆయన సతీమణికి చెంగాళమ్మ దేవస్థానం ట్రస్టు బోర్డు చైర్మన్‌తోపాటు పార్టీలో సముచితస్థానం కల్పించనున్నట్టు సమాచారం.

దబ్బల... దారేటు!

ఇక దువ్వూరు వర్గంగా కొనసాగిన సూళ్లూరుపేట మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. దువ్వూరు బాలచంద్రారెడ్డి వర్గంగా చెప్పుకునే దబ్బల మాత్రం వైసీపీని వీడడం లేదంటున్నారు. అలాగని ఎన్నికల తరువాత జరిగిన పార్టీ కార్యక్రమాలు, వైఎస్ జయంతి వేడుకలకు, వర్ధంతి కార్యక్రమాలకు ఆయన దూరంగా ఉండటంతో దబ్బల దారేటూ అంటూ చర్చలు జరుగుతున్నాయి.

టూరిస్టు హబ్‌గా మాధవమాల

కొయ్యబొమ్మలకు భౌగోళిక గుర్తింపు కోసం జీఐ అధ్యయన బృందం పరిశీలన


మాధవమాల వుడ్‌కార్వింగ్ సొసైటీలో కళాకారులు తయారు చేసిన బొమ్మలను పరిశీలిస్తున్న జీఐ బృందం

ఏర్పేడు, సెప్టెంబరు 3 :ఏర్పేడు మండలంలోని మాధవమాల గ్రామం భవిష్యత్తులో టూరిజం హబ్‌గా తయారు కాబోతుందని జియోలాజికల్ ఐడెంటిటీ (జీఐ) బృందం సభ్యులు పేర్కొన్నారు.మాధవమాల కొయ్యబొమ్మలు భౌగోళిక గుర్తింపు పొందడానికి అవసరమైన సమాచారాన్ని సేకరించేందుకు జీఐ నిపుణులు రిసెల్యూట్ సంస్థకు చెందిన శుభాజిత్ సాహో, శ్రీవత్స మంగరాటి మంగళవారం మాధవమాలకు వచ్చారు. గ్రామంలో ఉన్న బాలాజీ వుడ్ కార్వింగ్ సంస్థలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాధవమాల గ్రామంలో కళాకారులు తయారు చేస్తున్న కొయ్య బొమ్మలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడానికి జీఐ ట్యాగ్ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. దేశంలో 7వుడ్ కార్వింగ్ సొసైటీలకు జీఐ ట్యాగ్‌ను ఇప్పటికే అందించడం జరిగిందని చెప్పారు.బాలాజీ వుడ్ కార్వింగ్ సొసైటీకి జీఐ ట్యాగ్‌ను అందించిన వెంటనే ఆ సంస్థకు, అందులో పనిచేస్తున్న కార్మికులకు ఎస్‌వోసీ సర్టిఫికెట్లను అందిస్తుందని తెలిపారు. వాటిని ఆధారం చేసుకుని కార్మికులు ఏ ప్రాంతంలో అయినా బాలాజీ వుడ్‌కార్వింగ్ సొసైటీ అండర్ టేకింగ్ పేరుతో కొయ్య బొమ్మలు తయారు చేసుకుని అమ్ముకునే వెసులుబాటు ఉంటుందన్నారు.బొమ్మలను మార్కెట్ ధరకంటే ఎక్కువగా అమ్ముకోవడానికి జీఐ దోహదపడుతుందని తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటి వరకు భౌగోళిక గుర్తింపు కలిగినవి 19సంస్థలుమాత్రమే ఉన్నాయని, మాధవమాలలో కొయ్యబొమ్మల తయారీవిధానంపై తాము అధ్యయనం చేశామన్నారు.నాలుగు నెలల తరువాత తాము అందించిన అప్లికేషన్‌పై చెన్నై వేదికగా ఆరుగురు సెంట్రల్ సభ్యులు అధ్యయనం చేసి బాలాజీ వుడ్‌కార్వింగ్ సంస్థకు జీఐ గుర్తింపును ఇవ్వడం జరుగుతుందన్నారు.బాలాజీవుడ్ కార్వింగ్ సంస్థ ప్రమోటర్ కృష్ణమూర్తి, సంస్థ అధ్యక్షులు లోకనాథం ఆచారి, కార్యదర్శి రాజాచారి తదితరులు పాల్గొన్నారు.

స్విమ్స్‌లో అదృశ్యమై....రుయాలో దొరికాడు

- రోగి ఆచూకీ తెలియడంతో ఊపిరి పీల్చుకున్న స్విమ్స్ అధికారులు


సీతారామప్ప నుంచి వివరాలు తెలుసుకుంటున్న సీఐ రామకృష్ణ


విశ్వనాథ్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3 : స్విమ్స్‌లో కనిపించకుండా పోయిన రోగి సీతారామప్ప మంగళవారం రుయాలో ప్రత్యక్షం కావడంతో వారం రోజులుగా ఆయన ఆచూకీ కోసం ముమ్మరంగా గాలిస్తున్న స్విమ్స్ అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం బూరగమాకులపల్లెకు చెందిన టి.సీతారామప్పను కుమారుడు విశ్వనాథ్ గత నెల 27న వైద్యం కోసం స్విమ్స్‌కు తీసుకురావడంతో ఎంఐసీయూ వార్డులో అడ్మిట్ చేసిన విషయం తెలిసిందే. అదేరోజు రాత్రి సీతారామప్ప కన్పించకుండా పోయాడు. స్విమ్స్ అధికారులకు విశ్వనాథ్ తెలిపినా పట్టించుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.29న ఆంధ్రజ్యోతిలో స్విమ్స్‌లో రోగి అదృశ్యం శీర్షికన వార్త ప్రచురితమవడంతో పోలీసుల సహకారంతో స్విమ్స్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు.ఐదు రోజుల తరువాత ఆదివారం స్విమ్స్‌లోని సీసీ కెమెరాల్లో సీతారామప్ప ఒంటరిగా నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాలను గుర్తించారు. ఆయన స్వయంగా ఆస్పత్రిలో నుంచి వెళ్లిపోయాడు కాబట్టి తమకేం సంబంధం లేదని స్విమ్స్ అధికారులు చేతులు దులుపుకున్నారు. ఈ నేపథ్యంలో సీతారామప్ప ఎక్కడికి వెళ్లుంటాడనే కోణంలో పోలీసులు, మరో పక్క ఆయన బంధువులు గాలింపు చర్యలను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో సీతారామప్ప రుయాస్పత్రిలో ఉన్నట్లు తెలిసిన వారు విశ్వనాథ్‌కు సమాచారం ఇచ్చారు.దీంతో రుయాకు వెళ్లగా కాలికి బలమైన గాయంతో ఆర్థోవార్డులో చికిత్స పొందుతూ సీతారామప్ప కనిపించాడు. స్విమ్స్‌లో నుంచి వెళ్లిపోయాక ఒక వాహనం సీతారామప్పను ఢీకొట్టడంతో అతడి కాలికి బలమైన గాయం తగిలింది. దీంతో అక్కడున్న కొందరు గత నెల 30న సీతారామప్పను రుయాస్పత్రి అత్యవసర విభాగంలో అడ్మిట్ చేసి వెళ్లిపోయారు.సీతారామప్ప మాట్లాడే పరిస్థితిలో లేకపోవడంతో మొదట రుయాస్పత్రిలోని వైద్యులు గుర్తు తెలియని వ్యక్తిగా రికార్డుల్లో నమోదు చేసుకున్నారు.సీతారామప్ప కోలుకున్న తరువాత తన పేరు మాత్రమే చెప్పి చిరునామా చెప్పేందుకు అంగీకరించకపోవడంతో కేవలం పేరు మాత్రమే నమోదు చేసుకొని అతడిని ఆర్థో వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. వార్డులో ఓ స్టాఫ్‌నర్సు సీతారామప్పకు సంబంధించి పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా అతడిని గుర్తించి పోలీసులకు సమాచారం అందించింది. వెంటనే వెస్ట్ సీఐ రామకృష్ణ రుయాకు చేరుకొని సీతారామప్ప నుంచి వివరాలు సేకరించారు.స్విమ్స్ వైద్యులు అడ్మిట్ చేయాలని చెప్పడంతో తండ్రిని విశ్వనాథ్ ఎంఐసీయూ వార్డుకు తీసుకు వెళుతున్న క్రమంలో సీతారామప్ప ఆస్పత్రిలో ఉండలేనని కుమారుడికి చెప్పాడు.దీంతో ఉండకపోతే జబ్బు ఎలా తగ్గుతుంది అని కొడుకు గట్టిగా అరవడంతో నొచ్చుకున్న తాను అదే రోజు రాత్రి ఆస్పత్రి నుంచి వెళ్లిపోయినట్లు సీతారామప్ప వివరించాడు.కాగా సీతారామప్పకు సంబంధించి వరుస కథనాలను ప్రచురించి ఆయన ఆచూకీ లభించేందుకు సాయపడిన ఆంధ్రజ్యోతికి ఆయన కుమారుడు విశ్వనాథ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు.

'భూకబ్జా జరగలేదు.. ఆరోపణలన్నీ అవాస్తవం'

తిరుపతి (జీవకోన), సెప్టెంబరు 3: కేవీబీపురం మండలం రాయపేడులో 48 సెంట్ల స్థలాన్ని కబ్జా చేస్తున్నారంటూ ఉపాధ్యాయుడు మావిళ్లయ్య చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని అదే గ్రామానికి చెందిన దళితసంఘం నాయకుడు డాక్టర్ పి.రమేష్ అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గ్రామస్తులతో కలిసి మీడియాతో మాట్లాడారు. మావిళ్లయ్య పూర్వీకులు ఆ స్థలాన్ని లూథరన్ చర్చి వ్యవస్థాపకుడు జోర్నర్‌కు విక్రయించారని, దీనికి సంబంధించిన పత్రాలన్నీ ఉన్నాయని అన్నారు. ఈ స్థలంపై పంచాయితీ ఎమ్మెల్యే ఆదిమూలం వద్దకు వెళ్లగా, న్యాయ ప్రకారం నడుచుకోవాలని ఆయన సూచించారన్నారు. దాంతో ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. 2019 ఎన్నికల్లో టీడీపీకి మద్దతు తెలిపామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారి కుటుంబమంతా వైసీపీకి పనిచేసిందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల మాజీ ఎంపీపీ వెట్టి సుబ్రహ్మణ్యం, పాస్టర్ చటర్జీ, ఏయుమలై, మాజీ సర్పంచ్ సురేష్‌రెడ్డి, అశోక్, మాజీ ఎంపీటీసీ శివలింగం, జనసేన నాయకులు థామస్, దొరస్వామి పాల్గొన్నారు.

పెరిగిన శ్రీవారి లడ్డూల నిల్వలు

సమాచార కేంద్రాలకు తరలించిన టీటీడీ

తిరుమల, సెప్టెంబరు3(ఆంధ్రజ్యోతి): టీటీడీ నూతన విధానంతో తిరుమల శ్రీవారి లడ్డూల నిల్వలు పెరిగాయి. శ్రీవారిని దర్శించుకునే భక్తులకు ఓ ఉచిత లడ్డూతో పాటు లభ్యతను బట్టి 4 నుంచి 6 లడ్డూలు ఇవ్వాలని, శ్రీవారిని దర్శించుకోకుండా బయటనుంచి వచ్చే వ్యక్తులకు ఆధార్ కార్డుపై రోజువారీ రెండు లడ్డూలు మాత్రమే ఇవ్వాలని టీటీడీ నిర్ణయించిన విషయం తెలిసిందే.ఈ నూతన విధానంతో లడ్డూ దళారీలు కూడా తగ్గుతారని టీటీడీ ప్రకటించింది.ఈ నూతన విధానాన్ని గత గురువారం నుంచి అమలుచేస్తున్నారు. అయితే గత మూడురోజుల నుంచి భారీ వర్షాల నేపథ్యంలో తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య తగ్గింది. భక్తుల సంఖ్య తక్కువ కావడం, బయట వ్యక్తులకు ఆధార్‌పై రెండు మాత్రమే విక్రయిస్తున్న క్రమంలో మూడు రోజుల నుంచి తయారుచేస్తున్న లడ్డూల నిల్వలు పెరిగాయి. దీంతో మంగళవారం ఉదయం నుంచి శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు కోరినన్ని లడ్డూలు విక్రయిస్తున్నారు. లడ్డూల నిల్వ అధికంగా ఉండడంతో టీటీడీ అధికారులు చెన్నై, బెంగుళూరుల్లో వున్న టీటీడీ సమాచార కేంద్రాలకు, అనుబంధ ఆలయాలకు విక్రయాల కోసం 50 వేలకుపైగా లడ్డూలను పంపారు. అలాగే భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాలకూ లడ్డూలను పంపాలని టీటీడీ భావిస్తోంది.

భర్తను హత్య చేసిన కేసులో జీవితఖైదు

తిరుపతి(లీగల్), సెప్టెంబరు 3: భర్తను హత్య చేసిన కేసులో భార్యకు జీవిత ఖైదు విధిస్తూ 4వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి అర్చన తీర్పు చెప్పారు. రేణిగుంట బుగ్గవీధికి చెందిన ఎస్.వసుంధర.. 2022 జనవరి 20వ తేదీన ఉదయం 10గంటలకు భర్త రవిచంద్రసూరి తలను నరికి ఓ ప్లాస్టిక్ కవర్‌లో తీసుకొచ్చి రేణిగుంట పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చి లొంగిపోయింది. తన భర్త తనను, మానసిక వైకల్యంతో బాధపడుతున్న కుమారుడి బాగోగులను పట్టించుకోవడమే కాకుండా వివాహేతర సంబంధాలు పెట్టుకున్నాడని తెలిపింది. దీనిపై తరచూ గొడవలు జరిగేవని, ఈ క్రమంలో భర్తను తానే హత్య చేశానని అప్పట్లో చెప్పింది. నేరం నిరూపణ కావడంతో నిందితురాలికి శిక్ష ఖరారు చేశారు. రూ.వెయ్యి జరిమానా కూడా విధించారు.

రేణిగుంట డీఎస్పీగా మురళీధర్?

తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 3: రేణిగుంట డీఎస్పీగా మురళీధర్ నియమితులు కానున్నట్లు సమాచారం. ఇప్పటివరకు పనిచేసిన వెంకటాద్రికి అదనపు ఎస్పీగా పదోన్నతి లభించిన విషయం తెలిసిందే. దీంతో గతంలో రేణిగుంట రూరల్ సీఐగా, తిరుపతి క్రైం, ఎస్సీ, ఎస్టీ సెల్‌లో డీఎస్పీగా పనిచేసిన మురళీధర్ ప్రస్తుతం విశాఖపట్నం ప్రాంతంలో డీఎస్పీగా పనిచేస్తున్నాడు. ఈయన రేణిగుంట డీఎస్పీగా రానున్నట్లు తెలిసింది. కాగా.. ఈ పోస్టుకు మరో ఇద్దరు డీఎస్పీలు తీవ్రంగా పోటీ పడుతున్నట్లు సమాచారం.

ముందస్తు జాగ్రత్త చర్యలు


పుచ్చలపల్లి పొర్లుకట్టలను పరిశీలిస్తున్న తహసీల్దారు

కోట, సెప్టెంబరు 3: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం వల్ల ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మంగళవారం తహసీల్దారు జయజయరావు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. ఈ మేరకు పుచ్చలపల్లి వద్ద స్వర్ణముఖినదికి పడిన గండ్లను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని జల వనరుల శాఖ అధికారులు కోరారు. అదే విధంగా తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.

గూడూరులో కుండపోత


కోనేటిమిట్టలో పారుతున్న నీరు

గూడూరు, సెప్టెంబరు 3: పట్టణంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. సాయంత్రం ఆకాశం ఒక్కసారిగా మేఘావృతమై ఈదురు గాలులు వీచాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అరగంట కురిసిన వర్షం కారణంగా ఐసీఎస్‌రోడ్డు, కుమ్మరవీధి, త్యాగరాజవీధి, శాంతినగర్ అండర్‌బ్రిడ్జి, మాళవ్యానగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వర్షపు నీరు పారింది. దీంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. వర్షం తగ్గిన తరువాత విద్యుత్ సరఫరాను పునరిద్ధరించారు.

ముందు వెళ్తున్న లారీని ఢీ కొన్న మరో లారీ

- ఒకరికి తీవ్ర గాయాలు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 3: నాయుడుపేట - పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీ కొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం తెల్లవారు జామున కర్ణాటక నుంచి జార్ఖండ్‌కు సామగ్రి లోడ్‌తో వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న లారీని ఢీ కొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వెనుక వైపు ఢీ కొన్న లారీ డ్రైవర్ సద్దాం అన్సారీ లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమా చారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని క్రేన్ సాయంతో డ్రైవర్‌ను వెలుపలికి తీసి నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు

తడ, సెప్టెంబరు 3: చోరీ కేసులో పోలీసులు ఒకరిని అరెస్టు చేశారు. స్థానిక బీసీకాలనీలో నివాసం ఉంటున్న చెంచురత్నం కుటుంబసభ్యులు రాత్రి వేళల్లో తాళాలు వేసి ఇంటిపై నిద్రిస్తుంటారు. గత నెల 19వ తేదీ ఇలాగే ఇంటిపై నిద్రపోయారు. ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసుకు సంబంధించి పృథ్వీ ఈ చోరీకి పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించి మంగళవారం అతనిని అరెస్టు చేశారు. 44 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ కొండపనాయుడు తెలిపారు.

బీమా చెక్కు అందజేత

కోట, సెప్టెంబరు 3: మండలంలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళా శాలలో మంగళవారం వంజి వాకకు చెందిన కె.పవిత్రకు రూ.4లక్షల చెక్కును కళా శాల డైరెక్టర్ డాక్టర్ విజయ కుమార్‌రెడ్డి అందజేశారు. ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి హర్షిత్‌కుమార్ 2023లో జరిగిన ప్రమాదంలో మరణించాడు. కళాశాల యాజమాన్యం యాక్సిస్ బ్యాంక్‌లో గ్రూపు పర్సనల్ యాక్సిడెంటల్ పాలసీని చేసి ఉంది. విద్యార్థి మృతి తరువాత ఆ పాలసీ క్లెయిమ్ అవడంతో రూ.4 లక్షల చెక్కును హర్షిత్‌కుమార్ తల్లి పవిత్రకు అందజేశారు.

తిరువణ్ణామలైలో రూ.50 కోట్లతో వసతి గృహాలు

- రూ.23 కోట్లతో గిరిప్రదక్షిణ భక్తులకు వసతులు

చెన్నై, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలైలో భక్తుల కోసం రూ.50 కోట్లతో వసతి గృహాలు నిర్మించనున్నట్లు తమిళనాడు రాష్ట్ర మంత్రులు ఈవీ వేలు, పీకే శేఖర్‌బాబు ప్రకటించారు. తిరువణ్ణామలైలో గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులకు రూ.23 కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో వసతులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.గిరి ప్రదక్షిణ మార్గంలో 15 చోట్ల మరుగుదొడ్లు, స్నానపు గదులు, రెండు చోట్ల భక్తులు సేదతీరే కేంద్రాలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. గిరిప్రదక్షిణ మార్గంలో నిర్మించనున్న మరుగుదొడ్లు, స్నానపు గదులు సుమారు 13 అడుగుల ఎత్తులో ఉంటాయని తెలిపారు. ఇక భక్తుల కోసం నిర్మించే వసతి గృహాల వద్ద వాటర్ ఫౌంటైన్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 3: సూళ్లూరుపేట వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం జరిగింది. అంతర్జాతీయ వాసవి వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాల, నారాయణ పాఠశాలలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 72 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ శబరీష్, రీజనల్ చైర్మన్ సాయిరాం, జిల్లా ప్రభుత్వ వైద్యశాల బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి సందీప్ శ్రీనివాస్, సూళ్లూరుపేట ప్రభుత్వ బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జి దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు

రుయాస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

వెన్నెముకలో అరుదైన కణితి తొలగింపు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 3: లక్ష మందిలో ఒకరికి వచ్చే అరుదైన వ్యాధితో బాధపడుతున్న 15 ఏళ్ల బాలుడికి అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించామని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. ఆస్పత్రిలోని తన చాంబర్‌లో ఆయన మంగళవారం మీడియాతో వివరాలు వెల్లడించారు. 'చిత్తూరు జిల్లాకు చెందిన 15 ఏళ్ల బాలుడు రెండు కాళ్లకు పక్షవాతంతో బాధపడుతున్న క్రమంలో రెండు నెలల కిందట కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు వెన్నెముకలో అరుదైన కణితి ఉందని గుర్తించారు. ఇది సాధారణంగా కాకుండా అందులో వెంట్రుకలతో కలిసి ఉండటాన్ని గమనించారు. ఇది లక్షల్లో ఒకరికి వచ్చే టెరాటోమా వ్యాధిగా తేలింది. వెంటనే న్యూరోసర్జన్లు, అనస్థీషియా వైద్యులు శ్రమించి బాలుడి వెన్నెముకలోని కణితిని తొలగించారు. శస్త్ర చికిత్స తర్వాత బాలుడికి ఫిజియోథెరపీ చేయడంతో పూర్తిగా కోలుకోవడంతోపాటు సాధారణంగా నడుస్తున్నాడు' అని రవిప్రభు తెలిపారు. ఇటువంటి సర్జరీలు కార్పొరేట్ ఆస్పత్రుల్లో మాత్రమే చేస్తారని ఇందుకు రూ.లక్షలు ఖర్చవుతాయని చెప్పారు. రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యులు అందుబాటులో ఉండటంతో ఇటువంటి సర్జరీని విజయవంతంగా చేయగలిగామన్నారు. అసిస్టెంట్ ఆర్ఎంవో హరికృష్ణ, వైద్య నిపుణులు నాగరాజు, అనంత కిరణ్, సుదర్శన్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కూటమి ప్రభుత్వంతో ప్రశాంత పాలన



సమావేశంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సారథ్యంలో ప్రశాంతపాలన సాగుతోందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలో పరిస్థితులపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో గత వైసీపీ పాలనలో అప్పటి ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి అవినీతి, అరాచకాలు, రౌడీయిజం, కబ్జాలు, దుర్మార్గపు చర్యలతో ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా రాక్షస పాలన సాగించారని విమర్శించారు. నియోజకవర్గంలో మండలాల వారీగా కుటుంబ సభ్యులనే ఇన్‌ఛార్జిలుగా నియమించుకుని యధేచ్ఛగా దోపిడీ చేశారని ఆరోపించారు. కూటమి ఎమ్మెల్యేగా బొజ్జల సుధీర్‌రెడ్డి గెలుపొందిన తరువాత శ్రీకాళహస్తిలో అరాచకాలు అంతమయ్యాయని చెప్పారు. బొజ్జల కుటుంబం నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేసిందని వివరించారు. సుధీర్‌రెడ్డి తాత గంగి సుబ్బరామిరెడ్డి, తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఎన్నో మంచి పనులు చేశారని కొనియాడారు. ప్రస్తుత కూటమి పాలనలో బొజ్జల కుటుంబసభ్యులు హుందాగా వ్యవహరిస్తూ ఎక్కడా పరిపాలనలో జోక్యం చేసుకోకపోవడాన్ని ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు. డబులింజన్ పాలనతో అభివృద్ధే అజెండాగా ముందుకు వెళుతున్నామన్నారు. ఇందులో భాగంగా కేంద్రప్రభుత్వం నుంచి శ్రీకాళహస్తిలో టూరిజం అభివృద్ధి కోసం రూ.115 కోట్లు, అమృత్ పథకం కింద తాగునీటి సమస్య పరిష్కరించేందుకు రూ.23 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. మరింతగా శ్రీకాళహస్తిని అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, కొత్త ప్రభుత్వానికి అందరూ సహకరిస్తే మరింతగా ప్రగతి పథంలో దూసుకెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి ధర్నాను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3: శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట ఈ నెల 5న సీపీఐ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మురళి పిలుపునిచ్చారు. సీపీఐ కార్యాలయం వద్ద మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలోని మోదీ ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలను విపరీతంగా పెంచేసిందని వాపోయారు. ఇక శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రభుత్వ భూములు కాపాడాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీల భూములను ఆక్రమించుకున్న రాజకీయ నాయకులపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం గురువారం ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, భూబాధితులు తరలివచ్చి జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు జనమాల గురవయ్య, రొడ్డ గోపి, సివిల్ సప్లై వర్కర్స్ యూనియన్ నాయకులు అయ్యప్ప, ముని, రుక్కు, రాజ్ మేస్త్రీ, గిరి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవామూర్తులకు సన్మానం



ప్రముఖులను సన్మానిస్తున్న నాగమల్లి ఫౌండేషన్ సభ్యులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3: పట్టణంలోని సరస్వతిబాయి పురపాలకసంఘ ఉన్నత పాఠశాలలో మంగళవారం నాగమల్లి కృష్ణమూర్తి 10వ వర్ధంతిని పురస్కరించుకుని సామాజిక సేవ చేస్తున్న పలువురిని సన్మానించారు. నాగమల్లి కృష్ణమూర్తి ఫౌండేషన్ సేవలను ప్రధానోపాధ్యాయురాలు బృంద కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి రాజశేఖర్, సిద్దులుగారి జయబాబు, ఉపాధ్యాయులు, కవి, చిత్ర కళాకారుడు దామోదరాచారి, అంజూరు చక్రధర్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

మడిబాక చెరువు కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

ఏర్పేడు, సెప్టెంబరు 3: మడిబాక చెరువు కబ్జాదారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఏర్పేడు మండల సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రాయపనేని మల్లికార్జున్ నాయుడు మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అక్రమార్కులు మడిబాక చెరువును కబ్జా చేశారని పేర్కొన్నారు. చెరువును సర్వే చేపట్టి ఆక్రమణలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా మడిబాక చెరువు సర్వే చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

పని కల్పించాలని కూలీల వినతి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 3: మండలంలోని కొత్తపాళెం గ్రామానికి చెందిన కూలీలు ఉపాధి పథకం కింద పని కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో త్రివిక్రమ్‌రావుకు మంగళవారం విన్నవించారు. రెండు వారాలుగా ఉపాధి సిబ్బంది గ్రామంలో పనులు చేయించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. పనులు కల్పించాలని క్షేత్ర సహాయకుడు, టెక్నికల్ అసిస్టెంట్‌కు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. స్పందించిన ఎంపీడీవో వెంటనే పని కల్పించేలా చర్యలు తీసుకుంటామని కూలీలకు హామీ ఇచ్చారు.

పాఠశాలలో షెడ్డు నిర్మాణానికి దాతలు సహకరించండి

రేణిగుంట, సెప్టెంబరు 3: స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో షెడ్ నిర్మాణానికి దాతలు ముందుకు రావాలని ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధిని కోరారు. బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు చెట్ల కింద, వర్షం వచ్చినప్పుడు అరుగుపై కూర్చుని భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొందని, షెడ్డు నిర్మిస్తే సమావేశాలకు, ఉదయం ప్రార్థనకు ఉపయోగపడుతుందన్నారు. దాతలు ముందుకు వచ్చి షెడ్డు నిర్మాణానికి సహకరించాలని కోరారు.

విజయవాడకు సత్యవేడు పారిశుధ్య కార్మికులు



విజయవాడకు బయలు దేరుతున్న పారిశుధ్య కార్మికులు

సత్యవేడు, సెప్టెంబరు 3: విజయవాడ వరద సహాయక చర్యల కోసం సత్యవేడు పంచాయతీలో పనిచేస్తున్న పలువురు పారిశుధ్య కార్మికులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. విజయవాడలో వరద సహాయక, పారిశుధ్య చర్యలు వేగవంతం చేసేందుకు సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్మికులను విజయవాడకు తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరూరు సెక్రటరీ హరీష్ నేతృత్వంలో పంచాయతీ కార్మికులు భాస్కర్, పోలయ్య, శ్రీను, నవీన్ కుమార్ ప్రత్యేక వాహనంలో వెళ్లారు.

హత్యాచారం కేసులో నిందితులను వెంటనే శిక్షించాలి

కేవీబీపురం, సెప్టెంబరు 3: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం కేసులో నిందితులను వెంటనే శిక్షించాలని కేవీబీపురం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సిబ్బంది డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఆరోగ్యకేంద్రం వద్ద నిరసన తెలిపారు.

జనసేన ఫ్లెక్సీల ధ్వంసం
పోలీసులకు ఫిర్యాదు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3: జనసేన పార్టీకి చెందిన మూడు ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారంటూ ఆ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు... పవన్ కల్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో జనసేన పార్టీకి చెందిన హుస్సేన్, మహేష్ మూడు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మూడు ఫ్లెక్సీలను ధ్వంసం చేసి వాటి ఇనుప ఫ్రేమ్‌లను తీసుకుని వెళ్లారు. దీనిపై హుస్సేన్, మహేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసు అధికారులు ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న పోలీస్ అవుట్‌పోస్టులో సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు. గుర్తు తెలియని యువకుడు ఫ్లెక్సీలను ధ్వంసం చేసినట్లు గుర్తించారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 3: ఏకలవ్య గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని, అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వార్డెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే మెనూ సక్రమంగా సక్రమంగా అమలు జరగడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

పిచ్చాటూరు, సెప్టెంబరు 3: పిచ్చాటూరు జిల్లా పరిషత్ హైస్కూలులో మంగళవారం మధ్యాహ్నం భోజనాన్ని తహసీల్దార్ రమేష్‌బాబు తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు వడ్డించిన ఆహారాన్ని రుచి చూశారు. వంట నిర్వాహకులకు సూచనలు చేశారు. అనంతరం టీచర్స్ కాలనీ, ఇందిరానగర్ కాలనీల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో వీఆర్‌వో ప్రియాంక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఆముద, సఫియా పాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3: శ్రీకాళహస్తి మండలం ఈశ్వరయ్యకాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం స్కూల్ మేళా హెల్ప్ టు రూరల్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యాసామగ్రిని అందజేశారు. ఎంఈవో భువనేశ్వరి మాట్లాడుతూ దాతలు ఇచ్చిన విద్యాసామగ్రిని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు జగదీష్, వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శిరీష, సీఆర్ఎంటీ ప్రదీప్‌కుమార్, కృష్ణయ్య, ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏర్పేడు: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆయన అభిమానులు మంగళవారం ఏర్పేడు మండలం చిందేపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని అందించారు. కార్యక్రమంలో కోటేశ్వరరావు, ఉదయ్‌కుమార్, అనిల్‌కుమార్, తేజ, ప్రధానోపాధ్యాయులు శంకరయ్య, ఉపాధ్యాయుడు గురవారెడ్డి పాల్గొన్నారు.

దక్షిణ కాళికాదేవికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3: శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో వెలసిన దక్షిణ కాళికాదేవికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం రాహుకాలం సమయంలో అర్చకులు అమ్మవారి మూలమూర్తిని పూజా ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నిమ్మకాయలు, పూలమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు దీపాలు వెలిగించి హారతులు పట్టారు. అలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వరద బాధితులకు విరాళం

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 3: మండలంలోని ఆలత్తూరు గ్రామస్థులు విజయవాడలోని వరద బాధితుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 10వేల చెక్కును తహసీల్దార్ సుబ్రహ్మణ్యంకు మంగళవారం అందజేశారు.

పాఠశాల భవనం నిర్మించండి సారూ!





అసంపూర్తిగా ఉన్న ఇరుకు గదిలో చదువుకుంటున్న పిల్లలు - పాఠశాల కోసం రైతు మునస్వామి ఉచితంగా ఇచ్చిన స్థలం

రేణిగుంట, సెప్టెంబరు 3: రేణిగుంట మండలం ఆర్.మల్లవరం పంచాయతీలోని ప్రాథమిక పాఠశాల భవనాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారు. దీంతో స్థానిక హరిజనవాడలోని ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. అద్దె గది కూడా అసంపూర్తి నిర్మాణం కావడంతో పాటు కనీస వసతులు లేకపోవడంతో పిల్లలు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంతమంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడంతో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలో 24మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు, వెనుక పొలాలు ఉండటతో పాముల సంచారం అధికంగా ఉంటోంది. ఇటీవల పాఠశాల ఆవరణలో పిల్లలు ఆడుకుంటుండగా ఓ విద్యార్థి బ్యాగులో చిన్నపాము దూరింది. విద్యార్థి ఇంటికి వెళ్లాక బ్యాగులో పాము ఉండటాన్ని గుర్తించిన తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. గత నెల 22వ తేదీ కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఫిర్యాదు చేశారు. రోడ్డు విస్తీర్ణంలో తొలగించిన పాఠశాలకు సర్వశిక్ష అభియాన్ కింద కలెక్టర్ ఖాతాకు రూ.14లక్షలు మంజూరు చేశారు. అయితే ప్రభుత్వం స్థలం కేటాయించలేదు. గత వైసీపీ ప్రభుత్వంలో పాఠశాల నిర్మాణానికి స్థలం చూపాలని పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆర్.మల్లవరం గ్రామానికి చెందిన రైతు మునస్వామి 10 సెంట్ల భూమిని ఎంపీడీవో పేరుమీద ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చొరవ తీసుకుని పాఠశాల భవనం నిర్మించేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పకడ్బందీగా రాజీవ్‌నగర్ అక్రమాలపై సర్వే



ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3: రాజీవ్‌నగర్ అక్రమాలపై పకడ్బందీగా సర్వే నిర్వహిస్తున్నామని ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి తెలిపారు. సమగ్ర సర్వే నిర్వహణపై మంగళవారం ఆర్డీవో మాట్లాడుతూ 54 బృందాలతో సోమవారం నుంచి రాజీవ్‌నగర్‌లో సర్వే ప్రారంభించామన్నారు. మంగళవారం కూడా విస్తృతంగా సర్వే కొనసాగిందన్నారు. మొత్తం 5,400 ఇళ్ల స్థలాలకు గాను 2000 ఇళ్ల మాత్రమే నిర్మాణాలు పూర్తి చేసుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. సర్వే బృందాలు సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నాయని చెప్పారు. నిర్మించిన ఇళ్ల వివరాలతో పాటు ఖాళీ స్థలాలకు అసలు పట్టాదారులు ఎవరు, ఎవరు ఎవరికి విక్రయించారనే వివరాలను నమోదు చేస్తున్నామని, సర్వే పూర్తయిన తరువాత మొత్తం వివరాలను వెల్లడిస్తామని చెప్పారు. నిరుపేదల లబ్ధిదారుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదునూ స్వీకరించి ఆరా తీస్తున్నామన్నారు. ఇళ్ల స్థలాలపై సర్వే పూర్తయిన తరువాత రాజీవ్‌నగర్ కాలనీలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన భూములపై రెండవ దశలో మరో సమగ్ర సర్వే నిర్వహిస్తామని వెల్లడించారు. కాలనీలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలు, రోడ్లు కబ్జాకు గురైనట్లు ఇప్పటికే ఫిర్యాదులు ఉన్నాయన్నారు.

ఎస్సీ హాస్టల్‌కు రూ.10.90 లక్షలు మంజూరు

నారాయణవనం, సెప్టెంబర్ 3: నారాయణవనం మండలం పాలమంగళంలో ఉన్న ఎస్సీ హాస్టల్ మరమ్మతులకు రూ.10.90 లక్షలు మంజూరైంది. వారం రోజుల క్రితం సంక్షేమ శాఖ డీడీ చెన్నయ్యతో కలిసి సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఎస్సీ హాస్టల్ తనిఖీ చేశారు. సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విజ్ఞప్తి మేరకు హాస్టల్ మరమ్మతులకు రూ.10.90 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 3: విద్యార్థులు సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి విద్యాభ్యాసంపై శ్రద్ధ చూపాలని ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు అన్నారు. మండలంలోని పల్లమాల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పలు విషయాలపై మంగళవారం పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుందన్నారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలపై అఘాయిత్యాలు నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగారాజు నాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేడుకగా కాలభైరవస్వామి ప్రాకారోత్సవం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం వేడుకగా జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు, మేళతాళాల మధ్య అభిషేకాలు చేసి ధూప, దీప, నైవేద్య హారతులు సమర్పించారు. ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్థూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువుతీర్చారు.

నేడు సంతవేలూరు బస్సు ప్రారంభం

వరదయ్యపాళెం, సెప్టెంబరు 3: వరదయ్యపాళెం మండలం సంతవేలూరు మీదుగా సూళ్లూరుపేట బస్సును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం బుధవారం ప్రారంభించనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి తెలిపారు.

జగన్ దిగజారుడు రాజకీయాలు మానుకో: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 3: మాజీ సీఎం జగన్ దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని టీడీపీ బీసీ విభాగం నాయకులు అన్నారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారంలో ఉన్నన్ని రోజులు ప్యాలెస్‌లో కూర్చున్న జగన్ కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బయటకు రావాలంటే పచ్చని చెట్లు నరకడం, కొద్దిపాటి దూరానికి పరదాలు కట్టుకోవడం ఆయనకే చెల్లిందని ఎద్దేవా చేశారు. విపత్తులు సంభవించినపుడు హెలికాప్టర్ ద్వారా విహంగ వీక్షణ చేసి ప్యాలెస్‌లోకి వెళ్లిపోయిన జగన్, వరద బాధితులకు దగ్గరుండి సాయం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును విమర్శించడం సిగ్గుచేటన్నారు. విజయవాడ నగరంలో నీట మునిగిన లోతట్టు ప్రాంతాల్లోని బాధితులకు సహాయం అందిస్తున్న వారి ఆత్మస్థైర్యం దెబ్బతినేలా మాట్లాడుతున్న రోజా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మిన్నల రవి, ఉమేష్‌రావు, నెమళ్లూరు బుజ్జి, కోట చంద్రశేఖర్, చింతగింజల సునీల్, శివ, సయ్యద్ చాంద్‌బాషా, సులేమాన్, షేక్ జిలానీ పాల్గొన్నారు.

బత్తలవల్లంలో భూవివాదంపై ఉమ్మడి సర్వే



గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 3: మండలంలోని బత్తలవల్లంలో గత వారం రోజులుగా గ్రామస్తులు, అటవీశాఖ అధికారుల మధ్య జరుగుతున్న భూవివాద పరిష్కారానికి అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. వివాదాస్పద భూముల్లో రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఉమ్మడి సర్వేను మంగళవారం ప్రారంభించారు. బత్తలవల్లంలోని గోల్డెన్ సిటీ ఆలయం సమీపంలో గల భూముల్లో అటవీశాఖ అధికారులు వన సంరక్షణలో భాగంగా మొక్కలు నాటేందుకు యత్నించగా స్థానికులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం విన్నపంతో మంగళవారం రెవెన్యూశాఖ, అటవీశాఖ అధికారులు వివాదాస్పద భూముల్లో సర్వే చేపట్టారు.

విద్యార్థికి ఎమ్మెల్యే పరామర్శ



జయచంద్రతో మాట్లాడుతున్న ఆదిమూలం

పిచ్చాటూరు, సెప్టెంబరు 3: పిచ్చాటూరుకు చెందిన జగన్నాథం, రమ్య దంపతుల కుమారుడు జయచంద్ర(11) కామెర్ల వ్యాధితో తిరుపతిలోని వైష్ణవి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం ఆస్పత్రికి చేరుకుని విద్యార్థి జయచంద్రను పరామర్శించారు. ఆస్పత్రి చీఫ్ డాక్టర్ మునిశేఖర్‌తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. విద్యార్థి త్వరగా కోలుకుని బడికి వెళ్లి చక్కగా చదువుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

పుత్తూరు వార్తలు

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



మౌర్యతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 3: నగరి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ తుడా ఉపాధ్యక్షురాలు మౌర్యను కోరారు. మంగళవారం తిరుపతిలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించారు. తుడా పరిధిలోని ప్రాంతాల్లో సిమెంటు రోడ్డు, డ్రైనేజీ కాలువలు, తాగునీటి పైప్‌లైన్లు తదితర పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

పారిశుధ్య చర్యలు చేపట్టండి

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 3: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ తదితర ప్రాంతాల్లో రెండు రోజులుగా పారిశుధ్య చర్యలు చేపట్టక పోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. నిత్యం ప్రజలు, విద్యార్థులు తిరిగే ప్రాంతాల్లో పారిశుధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు వ్యాపిస్తున్నాయన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి పట్టణంలో చెత్తను తొలగించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులు, ప్రజలతో ఆందోళనలు చేపతామని ఆయన తెలిపారు.

పల్లె వెలుగు సర్వీసులేవీ?



పుత్తూరు ఆర్టీసీ డిపో

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 3: గ్రామీణ ప్రాంతాల పట్ల పుత్తూరు ఆర్టీసీ డిపో అధికారులు శీతకన్ను చూపుతున్నారు. గ్రామాలకు పల్లె వెలుగు సర్వీసులు నడిపేందుకు శ్రద్ధ చూపడం లేదు. 1985లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు 124 బస్సులతో పుత్తూరు డిపోను ప్రారంభించారు. అప్పటి నుంచి పుత్తూరు - అప్పాయిగుంట, బాదూరు, కోదండరామాపురం, పెనుమూరు, వెదురుకుప్పం, పాపానాయుడుపేట, వడమాలపేట, ఎలకా టూరు, కనకమ్మ సత్రం, నింద్ర ప్రాంతాలకు బస్సులు నడుపుతూ ఆదా యార్జనలో జిల్లాలోనే మొదటి స్థానంలో ఉండేది. అయితే కాలక్రమేణా నష్టాల పేరుతో గ్రామీణ సర్వీసులను రద్దు చేశారు. దీంతో గ్రామీణ ప్రాం తాల ప్రజలు, విద్యార్థులు, చిరు వ్యాపారులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధిక చార్జీలు చెల్లించి ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాలకు బస్సు సర్వీసులను నడపాలని ప్రజలు కోరుతున్నారు.

శ్మశానం ఆక్రమణను అడ్డుకోండి

పుత్తూరు టౌన్, సెప్టెంబరు 3: పుత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని చెర్లోపల్లె ఆదిఆంధ్రవాడ శ్మశాన స్థలంలో పాగా వేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం కార్యదర్శి వెంకటేష్, గిరిజన సంఘం కార్యదర్శి నందయ్య మాట్లాడుతూ చెర్లోపల్లె శ్మశానంపై రియల్ ఎస్టేట్ వ్యాపారులు రోడ్డు వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చెర్లోపల్లె శ్మశాన స్థలాన్ని రికార్డుల్లో ఎక్కించి, హద్దులు ఏర్పాటు చేసి, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మేరకు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం సమర్పించారు. శ్మశాన సమస్యను పరిష్కరిస్తామని తహసీల్దార్ వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు నాగభూషణం, మాతయ్య, వెంకటేష్, హరి, సుధ పాల్గొన్నారు.